దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States


Y. Sreedevi
Proprietor
9397317951
Cell: 9515348320
GST : 36AHXPY3131E1ZX
NANDINI MEMENTOS
Corporate Gifting & Printing Services
Specialists in Medals*Gift Items*Shalls
E.mail- nandinimementos2@gmail.com
Chikkadpally, Hyderabad 500 020.

సంపుటి : 23 | సంచిక : 203 | ది. 17-10-2024 | విజయవాడ | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

# తెలంగాణ కేబినెట్ విస్తరణ?

## • కౌన్ బనేగా మినిస్టర్.. రేసులో ఉన్నది వీరేనా..?



**తెలంగాణ,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** తెలంగాణ కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ దృష్టి పెట్టింది. నెలాఖరులోపే ఈ ప్రక్రియ పూర్తి కానున్న నేపథ్యంలో ఆశావహులు లాబీయింగ్ మొదలు పెట్టారు. తమ సీనియారిటీ, సిన్సియారిటీ పరిగణించాలంటూ హైకమాండ్‌కి సంకేతాలు పంపుతున్నారు. గత డిసెంబరులో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ఆ సమయంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితోపాటు మరో 11 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ త్వరాత మంత్రి వర్గ విస్తరణ త్వరలో జరుగుతుందని గత కొన్ని నెలలుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ జమ్మ కశ్మీర్, హర్యానా ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలు ఎన్నికల బిజీలో ఉండిపోయారు. దాంతో వారు రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణను పెద్దగా పట్టించుకోలేదు. అయితే ఆ రాష్ట్రాల ఎన్నికలు పూర్తవడంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్తున్నారు. ఇటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సహా ముఖ్య నేతలు కూడా ఢిల్లీ వెళుతుండటంతో కేబినెట్ విస్తరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. CWC సమావేశంలో పాల్గొననున్న రేవంత్‌రెడ్డి.. కేబినెట్ విస్తరణపై హైకమాండ్‌తో చర్చించనున్నట్లు తెలుస్తోంది. మరో నలుగురికి కేబినెట్‌లో అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోందని ఈసారి విస్తరణలో ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం ఊపందుకుంది. దీంతో కేబినెట్ విస్తరణపై ఆశావహుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. తాజాగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలతో కేబినెట్ విస్తరణ ఇక ఎంతో దూరంలో లేదన్నది స్పష్టమైంది. కేబినెట్ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలతో ఆశావహులు అలర్టయ్యారు. మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు ప్రచారం జరుగుతుండడంతో వారి ప్రయత్నాలు మరింత ముమ్మరం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సీనియర్ నాయకుడు ప్రేమ్ సాగర్ రావుతో పాటు, వివేక్, వినోద్ సోదరులు రేసులో ఉన్నారు. దీంతో ముందే వారికి చెక్ పెట్టేందుకు సీనియర్ కాంగ్రెస్ నేతగా మంత్రి పదవి ఆశిస్తున్నానని మీడియా ముందు కుండబద్దలు కొట్టారు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు. అయితే మంత్రి పదవి ఎవరికివ్వాలనేది అధిష్ఠానం చూసుకుంటుందని హైకమాండ్‌పై తన విధేయతను కూడా తెలియజేశారు. ఇటు ప్రేమ్ సాగర్ రావుకి కౌంటర్‌గా వివేక్, వినోద్ సోదరులు ఢిల్లీ స్థాయిలో మంత్రి పదవి కోసం ఎవరికి వారు లాబీయింగ్ చేస్తున్నారు. ఇప్పటికే వివేక్ తనయుడికి పెద్దపల్లి ఎంపీగా అవకాశం రావడంతో కాకా ఫ్యామిలీ కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని వినోద్ నేరుగా సోనియాగాంధీ స్థాయిలోనే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే తనని కాకా ఫ్యామిలీ కోటాలో పరిగణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల కాకా వెంకటస్వామి జయంతి వేడుకలో చెప్పటం.. అయితే మంత్రి వర్గ విస్తరణలో కాకా ఫ్యామిలీ కోటా అయిపోయిందని సీఎం రేవంత్ చమత్కరించడం జరిగింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి గెలిచిన సీనియర్ నాయకుల్లో మాజీ మంత్రి ప్రస్తుత బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మంత్రి వర్గవిస్తరణలో ముందు వరుసలో ఉన్నారు. ఈ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలలో సుదర్శన్ రెడ్డి సీనియర్ కావడంతో పాటు వై.యస్ హయాంలోనే మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండటంతో ఆయనకు పోటీ పెద్దగా లేకపోవడం కలిసి వస్తోంది. మొత్తానికి ఈ సారి కేబినెట్ విస్తరణ జరుగుతుందని బలమైన సంకేతాలు వస్తున్న నేపథ్యంలో అమాత్య యోగం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

# ఒకేసారి ఆరు కొత్త పాలసీలు తీసుకువచ్చాం: సీఎం చంద్రబాబు

## రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం - కీలక నిర్ణయాలు






**అమరావతి,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** ఏపీ క్యాబినెట్ సమావేశం ముగిసిన అనంతరం సీఎం చంద్రబాబు స్వయంగా మీడియా ముందుకు వచ్చారు. మీడియా సమావేశంలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకేసారి ఆరు కొత్త పాలసీలు తీసుకువచ్చామని వెల్లడించారు. 1. ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ పాలసీ 2. ఏపీ ఎంఎస్ఎంఈ, ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్ మెంట్ పాలసీ 3. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4. ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ 5. ఏపీ ప్రైవేటు పార్కుల పాలసీ 6. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ... తీసుకువచ్చినట్టు వివరించారు. ఇవాళ్టి క్యాబినెట్ సమావేశంలో ఈ ఆరు కొత్త పాలసీలపై చర్చించి ఆమోదం తెలిపామని చంద్రబాబు పేర్కొన్నారు. థింక్ గ్లోబల్లీ, యాక్ట్ గ్లోబల్లీ అనేది తమ నినాదం అని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ అనేది తమ ప్రభుత్వ నినాదమని చంద్రబాబు తెలిపారు. కుటుంబానికో పారిశ్రామికవేత్త ఉండడమే తమ విజన్ అని, ఉద్యోగాలు చేయడం కాదు, ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి రావాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల వేళ మేనిఫెస్టోలోనూ తాము ఇదే చెప్పామని గుర్తు చేశారు. పెట్టుబడులు తీసుకువస్తాం... అభివృద్ధి చేస్తాం... సంపద పెంచుతాం... పెంచిన ఆదాయం పేదలకు సంక్షేమ రూపంలో అందిస్తాం అని పునరుద్ఘాటించారు. ముఖ్యంగా విదేశీ పెట్టుబడులు రాబట్టడంపై దృష్టి సారిస్తామని, తీవ్రస్థాయిలో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. “నాలెడ్జ్ ఎకానమీ, అగ్రికల్చర్, ఆక్వా, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు మన రాష్ట్ర బలాలు. పెట్టుబడి రహిత ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహిస్తాం. ఎంఎస్ఎంఈలను భారీ ఎత్తున ముందుకు తీసుకెళతాం... ప్రతి కుటుంబం ఒక చిన్న తరహా పరిశ్రమ పెట్టేలా ప్రోత్సహిస్తాం. అందుకోసం ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి, సాయం చేస్తుంది. ఇక, రాయలసీమను ఆటోమొబైల్ హబ్ గా తీర్చిదిద్దుతాం. రాయలసీమ ప్రాంతానికి ఉన్న అనుకూలతను సద్వినియోగం చేసుకుంటాం. ఇక్కడ భూమి ఉంది, నీళ్లు ఉన్నాయి, కరెంటు ఉంది... ఆటోమొబైల్ హబ్ కావడానికి అవసరమైన అన్ని అంశాలు రాయలసీమలో ఉన్నాయి. సౌర, పవన శక్తిని కూడా ముందుకు తీసుకెళతాం. వీటన్నింటిని సమీకృతం చేస్తూ రాయలసీమను మరో స్థాయికి తీసుకెళతాం. అదే సమయంలో, ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూడా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందుకు తగిన ప్రణాళికలు మా వద్ద ఉన్నాయి. భోగాపురం ఎయిర్ పోర్టు, భావనపాడు పోర్టులను సకాలంలో పూర్తి చేస్తాం. ఇక్కడ 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్ ను అభివృద్ధి చేస్తాం. విశాఖను బెస్ట్ సిటీగా, నాలెడ్జ్ ఎకానమీకి కేరాఫ్ అడ్రస్ గా తీర్చిదిద్దుతాం. ఇకపై ఏపీలో ‘ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ కాదు ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ ఉంటుంది. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలు ఎన్ని ఎక్కువ ఉద్యోగాలు ఇస్తే అన్ని మంచి రాయితీలు అందిస్తాం. గ్లోబల్ బ్రాండ్స్ ను మరింత ముందుకు తీసుకెళతాం. ఫార్చ్యూన్ 500 కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తాం. మా విజన్ స్వర్ణాంధ్ర-2047. పరిశ్రమలకు సంబంధించి ఉత్పాదక వ్యయం తగ్గించాలనేది మా లక్ష్యం. అదే సమయంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పెంచుతూ, అంతర్జాతీయస్థాయి తయారీ కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దుతాం. ఒక్క తయారీ రంగంలోనే ఐదు లక్షల ఉద్యోగాలను సాధించడం మా టార్గెట్. ప్రతి నియోజకవర్గంలో ఒకటి కంటే ఎక్కువగా ఇండస్ట్రియల్ పార్కులు ఉండేలా చూస్తాం... మా ఇండస్ట్రియల్ పాలసీలో ముఖ్యమైన అంశం కూడా ఇదే. తూర్పు తీరంలో మన రాష్ట్రం మధ్యలో ఉంటుంది.. అదే మన బలం. దీన్ని సద్వినియోగం చేసుకుంటాం” అని చంద్రబాబు వివరించారు.

# బీసీలకు కవచం బీసీ రక్షణ చట్టం

• రాష్ట్ర మంత్రులు వెల్లడి • బీసీ రక్షణ చట్టం విధివిధానాలపై మంత్రుల సమావేశం • పాల్గొన్న 8 మంది బీసీ మంత్రులు, హోం మంత్రి అనిత





**అమరావతి,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో వెనుకబడిన తరగతులు గౌరవప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా బీసీ రక్షణ చట్టం రూపొందిస్తున్నట్లు ఆ సామాజిక వర్గానికి మంత్రులు స్పష్టం చేశారు. ఈ చట్టం రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు రక్షణ కవచంలాంటిదని అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడుతూ, బీసీ డిక్లరేషన్ లో పేర్కొన్నఅన్ని అంశాలనూ సీఎం చంద్రబాబు అమలు చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నారని వారు స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మూడో బ్లాక్ లో నిర్వహించిన బీసీ రక్షణ చట్టం విధివిధానాల రూపకల్పనపై నిర్వహించిన తొలి సమావేశంలో 8 మంది రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎస్.సవిత, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్ సహా హోంమంత్రి అనిత పాల్గొన్నారు. ముందుగా బీసీ రక్షణ చట్టం ఆవశ్యకతను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత...మంత్రులకు వివరించారు. జగన్ హయాంలో రాష్ట్రంలో బీసీల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ కరవైందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు బలైపోతున్న బీసీల దుస్థితిని మీ కోసం బస్సు యాత్రలో సీఎం చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ స్వయంగా పరిశీలించారన్నారు. బీసీలను ఆదుకోవాలని నిర్ణయించి... బీసీ డిక్లరేషన్ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రకటించారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డిక్లరేషన్ లో పేర్కొన్న అంశాలను అమలు చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలకు కట్టుబడుతూ, సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు. ఇటీవలే చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ లో తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేశారన్నారు. ఆదరణ వంటి పథకాలను అమలుకు నిర్ణయం తీసుకున్నారని మంత్రి సవిత తెలిపారు. ఇదే సమయంలో బీసీ రక్షణ చట్టం విధివిధానాల రూపకల్పనకు చర్యలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగానే బీసీ మంత్రులతో సమావేశం నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. కులపరంగా, వ్యక్తిగతంగా దూషించిన చర్యలు తీసుకునేలా చట్టం రూపొందిస్తున్నామన్నారు. ఏపీలో అమలు చేయబోయే బీసీ రక్షణ చట్టం దేశంలోనే తొలిసారని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, బీసీ చట్టం రూప కల్పనలో న్యాయ నిపుణులు, రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ, చట్టాన్ని పకడ్బందీగా రూపొందించాలన్నారు. ఇందుకోసం ఇతర చట్టాలను అధ్యయనం చేయాలన్నారు. మంత్రి కొల్లురవీంద్ర మాట్లాడుతూ, జగన్ హయాంలో బీసీలపై జరిగిన దాడులను చూసి. వెనుకబడిన తరగతుల రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నిర్ణయం తీసుకున్నారన్నారు. చట్టం రూపకల్పనలో సెక్షన్లు, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి రూపొందించాలన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల్లో బీసీల రక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి, చట్టం రూపకల్పనలో వినియోగించాలన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, చట్టం బీసీలకు రక్షణ కవచంలా ఉండాలన్నారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, బీసీ రక్షణ చట్టం రూపకల్పనలో మరిన్ని పర్యాయాలు సమావేశాలు నిర్వహించాలన్నారు. అంతకు ముందు బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ మాట్లాడుతూ, బీసీల్లో ఎన్ని ఉప కులాలు ఉన్నాయి..వాటికి రిజర్వేషన్ల అమలు తీరుతెన్నులను వివరించారు. బీసీ రక్షణ చట్టంతో బీసీల్లో తీవ్రంగా వెనుబడిన కులాలకు మేలు కలుగుతుందన్నారు.

# హైదరాబాద్ నగర విస్తరణకు సకల చర్యలు


• హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగితే నిర్మాణరంగం విస్తరిస్తుంది
• బిల్డర్ల సమస్యలను గౌరవించి పరిష్కరిస్తాం
• బిల్డర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కమల్లు
• హైదరాబాద్ నగర అభివృద్ధికి పదివేల కోట్లు కేటాయించాం : మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



**హైదరాబాద్,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** హైదరాబాద్ నగరాన్ని బాగా విస్తరింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది, విస్తరణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంలో వెనుకాడే ప్రసక్తే లేదని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో బిల్డర్స్ తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కమల్లు, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సమావేశమయ్యారు. బిల్డర్స్ సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందన్న విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, యావత్ మంత్రిమండలి మీతో పంచుకోవాలని కోరినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు బిల్డర్లకు తెలిపారు. హైదరాబాద్ నగరం విస్తరణలో బిల్డర్స్ పాత్ర బలంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం మనస్ఫూర్తిగా కోరుకుంటుంది అని తెలిపారు. హైదరాబాద్ ను విశ్వ నగరంగా మార్చేందుకు తాజా బడ్జెట్లో పదివేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ కోసం మాత్రమే వీటిని ఖర్చు చేస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, వరల్డ్ క్లాస్ స్టేడియం లు , స్కిల్ యూనివర్సిటీ వంటి గొప్ప ప్రాజెక్టులతో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో నిలపబోతున్నామని వివరించారు. రాష్ట్రంలో నిర్మాణ రంగాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు బిల్డర్స్ కోరిన విధంగా బ్యాంకర్స్ తో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన ప్రధాన ప్రభుత్వ శాఖల ద్వారా బిల్డర్స్ కోరుకున్న విధంగా స్పష్టత ఇప్పిస్తామని బిల్డర్లకు డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. హైదరాబాద్ నగర రాజ్యాంగ విస్తరించింది. ప్రస్తుతం ఉన్న చెరువులు, కుంటలు కాపాడుకొని భవిష్యత్తు తరాలకు అందించాలనే ఉన్నత లక్షమే తప్ప ఈ ప్రభుత్వానికి మరో ఉద్దేశం లేదని వివరించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ని పెంచితేనే నిర్మాణరంగం పెరుగుతుంది, మూసీ నదిని పునర్జీవింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వం బలంగా భావిస్తుందని తెలిపారు. అనేక దశాబ్దాలుగా ఉన్న చెరువులు, కుంటలు క్రమంగా కనుమరుగవుతున్నాయి, వాటిని కాపాడుకొని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత మనందరిపైన ఉందని వివరించారు.

# దూసుకొస్తున్న వాయుగుండం

• రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు
• నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం - సహాయక చర్యల కోసం జిల్లాల్లో 5ఎస్డీఆర్ఎఫ్, 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు



**(అమరావతి,అక్టోబరు 16 (వార్తాప్రభ) )** నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్?లోని పలు జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. చెన్నైకి 280 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 320 కిలోమీటర్లు.. నెల్లూరుకు 370 కిలోమీటర్ల మేర దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉంది. పశ్చిమ వాయవ్య దిశగా 15 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తోంది. దీని ప్రభావంతో దక్షిణకోస్తా, రాయలసీమలోని కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్ఆర్ జిల్లాల్లో ఆకస్మిక వరద వచ్చే ఛాన్స్? ఉంది. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది. ఇప్పటికే సహాయక చర్యల కోసం జిల్లాల్లో 5ఎస్డీఆర్ఎఫ్, 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. అవసరమైన చోట పునరావాస సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

**సీమ జిల్లాల్లో జోరు వానలు**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రాయలసీమ జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కడప, అన్నమయ్య, ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో జోరువానలతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. విద్యాసంస్థలకు అధికారులు సెలవులు ప్రకటించారు. తిరుమలలో రెండో రోజూ ఎడతెరిపిలేని వర్షంతో భక్తులకు ఇక్కట్లు తప్పలేదు. వాయుగుండం ప్రభావంతో వైఎస్ఆర్? జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కడప నగరం జలదిగ్బంధమైంది. ఎడతెరిపిలేని వర్షాలకు రహదారులన్నీ వర్షపు నీటితో నిండి పోయాయి.

# కంచి విశ్వవిద్యాలయంలో చేరిన 86 మంది తెలంగాణ విద్యార్థులు

• కంచి స్వామీజీని దర్శించుకున్న ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్






**హైదరాబాద్,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** కంచి లోని శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయంలో వివిధ ఉన్నత స్థాయి కోర్సులలో ఈ విద్యా సంవత్సరం తెలంగాణా రాష్ట్రానికి చెందిన 86 మంది చేరారు. వివిధ కోర్సులలో చేరిన ఈ విద్యార్థినీ విద్యార్థులకు కంచి స్వామిజి శంకర విజయేంద్ర స్వరస్వతి ఆశీర్వచనాలు అంద చేశారు. . రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ కంచి కామకోటి పీఠానికి వెళ్లి కంచి స్వామీజీ విజయేంద్ర సరస్వతిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత విద్య సంవత్సరం కంచి విశ్వవిద్యాలయంలో చేరిన తెలంగాణా కు చెందిన 34 మహిళా విద్యార్థినులు, 52 మంది విద్యార్థులతో శైలజా రామయ్యర్ సమావేశమయ్యారు. కంచి విశ్వవిద్యాలయంలో భారతీయ సంస్కృతీ, ఇంజనీరింగ్, న్యాయ శాస్త్రం, ఆర్ట్స్, హ్యూమానిటీస్ తదితర విభాగాలలో ఈ విద్యార్థులు చేరారు. వివిధ కోర్సులలో చేరిన తమకు కంచి స్వామీ శంకర విజయేంద్ర స్వరస్వతి ఆశీర్వచనాలు అందచేశారని, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన ఈ విశ్వ విద్యాలయంలో అత్యంత నిష్ణాతులైన ఉత్తమ అధ్యాపకులు ఉన్నారని విద్యార్థులు ఆమెకు తెలిపారు. అనంతరం, కంచి చిన్న స్వామీ విజయేంద్ర సరస్వతి ని కలసి వారి ఆశీర్వచనం పొందిన ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, తెలంగాణా విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్యను అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

# ముహూర్తం ఫిక్స్

• ప్రజా ఉద్యమాలకు బీజేపీ, బీఆర్ఎస్ ప్లాన్..!
• రంగంలోకి దిగనున్న గులాబీ బాస్




**హైదరాబాద్,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** నవంబర్ నుంచి తగ్గేదేలే అంటోంది కాషాయం పార్టీ. డిసెంబర్‌లో దమ్ము చూపిస్తామంటోంది బీఆర్ఎస్. ఎవరెన్ని చేసినా, ఎలాంటి డేట్స్ ఫిక్స్ చేసుకున్నా ఇచ్చిపడేస్తామంటోంది అధికార కాంగ్రెస్. మొత్తంగా తెలంగాణలో ఇయర్ ఎండింగ్ పాలిటిక్స్ ఇష్యూ కాక రేపుతోంది. అధికార కాంగ్రెస్‌పై పవర్ ఫుల్ ఫైట్‌కి సిద్ధమవుతున్నాయి ప్రతిపక్షాలు. పక్కా ప్లాన్‌తో ప్రజాల్లోకి వెళ్లాలని డిసైడ్ అయ్యాయి. ఎన్నికల హామీలపై కాంగ్రెస్ తీరును ఎండగడుతూ నవంబర్‌లో ఉద్యమానికి కాషాయం పార్టీ సై అంటుంటే కాంగ్రెస్ వన్ ఇయర్ పాలనపై పోరాడుతామంటూ డిసెంబర్‌ను ఫిక్స్ చేసుకుంది బీఆర్ఎస్. మరోవైపుత ఎవరెలా వచ్చినా ఏం చేయలేరంటోంది అధికార కాంగ్రెస్. దీంతో తెలంగాణ పాలిటిక్స్ మరింత ఇంట్రెస్టింగ్‌గా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ నుంచి ప్రజాసమస్యలపై ఉద్యమిస్తామని క్లారిటీ ఇచ్చారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఒక్క ఇల్లు కట్టలేదు. పేదలకు ఒక్క ఇల్లు పంచలేదు గ్యారంటీలు రోడ్డున పడ్డాయన్నారు. హామీల పేరుతో రాష్ట్రాన్ని దివాలా తీసేలా చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన ప్రతి హామీపైనా ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఇక డిసెంబర్‌తో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతుంది. ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు ఏం చేసింది? ఎన్ని గ్యారంటీలు అమలు చేసింది? ఎన్ని హామీలు నెరవేర్చింది? అంటూ బీఆర్ఎస్ సైతం ప్రభుత్వంపై ఫైట్‌కి సిద్ధమవుతోంది.

**వార్తాప్రభ - పంచాంగం**

**17-10-2024 గురువారం**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం. ఆషాఢమాసం, శుక్లపక్షం

తిథి : పౌర్ణమి 4.14 వరకు
నక్షత్రం : రేవతి 4.20 వరకు
వర్జ్యం : 3.14 నుండి 4.38 వరకు
దుర్ముహూర్తం : 09.05 నుండి 10.33 వరకు
రాహుకాలం : 2.57 నుండి 4.25 వరకు
మంచి సమయం : 2.14 నుండి 3.38 వరకు
సూర్యోదయం : 5.57 కి
సూర్యాస్తమయం : 5.39 కి

# ఘనంగా వరల్డ్ అనస్థీషియా డే వేడుకలు



**కాకినాడ,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** వరల్డ్ అనస్థీషియా డే పురస్కరించుకుని కాకినాడ సొసైటీ అఫ్ అనేస్తేషలోజిస్ట్స్, కాకినాడ జిజిహెచ్ డిపార్ట్మెంట్ ఆఫ్ అనస్థీషియా కాకినాడ అనస్తీషియా డేను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా వాకర్స్ క్లబ్లో అనస్థీషియా,సిపిఆర్ మీద అవగాహనా కల్పిస్తూ కరపత్రాలను పంచి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిధులుగా డాక్టర్లు చక్రరావు, కామేశ్వరరావులు విచ్చేసారు. డాక్టర్ చక్రరావు మాట్లాడుతూ 1846లో మొదలైన ఈ అనస్థీషియా లో డెవలప్మెంట్ రోజు రోజుకి పెరుగుతూ అడ్వాన్స్ డుగా నేడు శస్త్రచికిత్సకు నొప్పి లేకుండా అయ్యేందుకు సులభం అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎంసి వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథన్, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ అనంతలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ అచ్యుతరామ య్య,కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ చిట్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన పల్లె పండుగ ఫేజ్ టు సమావేశం - ఇన్చార్జి ఈవో పి ఆర్ డి హరికృష్ణ



**విస్సన్నపేట,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** స్థానిక మండల పరిధిలో పల్లె పండుగ ఫేజ్ టు కార్యక్రమం నకు సంబంధించి మైనర్ వర్కులపై 15 సచివాలయాల పరిధిలో ఇన్చార్జి ఈఓపిఆర్డి హరికృష్ణ సమావేశమయ్యారు. గ్రామ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు పాల్గొన్న ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల పరిధిలో ఫేజ్ వన్ పనులతో పాటు మంచినీరు సరఫరా సంబంధిత రిపేర్లు సప్తాల ఏర్పాటు తదితర నిర్మాణాలపై ప్రణాళికలు రూపొందించాలని ఆయన చెప్పారు.

# ఇక్కడ మద్యం షాపు వద్దే...వద్దు

- మద్యం షాపు ఏర్పాటుకు ఆదిలోనే హంసపాదు
- వెల్వడంలో ఏర్పాటు చేయబోయే మద్యం షాపును అడ్డుకున్న మహిళలు
- ఇక్కడ మద్యం షాపు పెట్టడం వల్ల గతంలో అనేక ఇబ్బందులు పడ్డాం
- నివాసాలు మధ్య వైన్ షాపు ఎందుకు పెడుతున్నారు?



**మైలవరం,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** ఏపీ లో మద్యం షాపులకు మహిళల నుంచి నిరసన సెగ తగిలింది. కొత్తగా వైన్ షాప్లు దక్కించుకున్నవారు ఇప్పటికే షాపులు ఏర్పాటు చేసుకోవ దంలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యం లో ఎన్టీఆర్ జిల్లా, మైలవరం నియోజక వర్గం వెల్వడం గ్రామ వద్ద చిన నందిగామ వెళ్లే రోడ్డులో మద్యం వ్యాపారులకు ఆదిలోనే చుక్కెదురైంది. రోడ్డు పక్కన ఏర్పాటు చేయబోయే వైన్ షాపును అక్కడి మహిళలు అడ్డుకున్నా రు. నూతన మద్యం షాపు ను ప్రారంభిం చడానికి ఏర్పాట్లు జరుగుతున్న క్రమం లో మహిళలు వచ్చి ఇళ్ల మధ్యలో షాపు ఏర్పాటు చేయడానికి వీలులేదని ఆందోళనకు దిగారు. మద్యం షాపులకు వ్యతిరేకంగా అక్కడి మహిళలు,స్థానికు లు నినాదాలు చేశారు. మద్యం షాపు పెడితే ఊరుకోమని మహిళలు హెచ్చరించారు. మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల ఇక్కడ అసంఘిక కార్యక్ర మాలు జరిగే అవకాశం ఉందని మహిళ లు వాపోతున్నారు. ఇళ్ల మధ్యలో మద్యం షాపు ఉండటం వల్ల రాత్రివేళ ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి కూడా ఉండదన్నారు. ఇళ్లు వదిలి ఊరు వెళ్లే పరిస్థితి కూడా ఉండదన్నారు. ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లో మద్యం షాపు పెట్టడా నికి వీలులేదని మహిళలు గగ్గోలు పెట్టా రు. గతంలో ఇక్కడ మద్యం షాపు పెడితే స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తీయించారు. అయినా మళ్ళీ ఇక్కడ మద్యం షాపు ఎలా పెడతారని మహిళలు ప్రశ్నిస్తున్నారు. మీ స్వార్ధ ప్రయోజనాల కోసం మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తారా? అని మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్ల మధ్యలో మద్యం షాపులు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

**మద్యం షాపు పెట్టడం వల్ల దొంగల బెడద ఉంది :చెన్నారావు,వెల్వడం**



ఇక్కడ వైన్ షాపు పెట్టడం వల్ల దొంగల బెడద ఉంది. గతంలో ఇక్కడ పెట్టిన వైన్ షాపు వల్ల ఇళ్లల్లో చోరీలు జరిగాయి. అప్పట్లో ఎమ్మెల్యే చొరవతో షాపు తీసేశారు. మద్యం షాపు వల్ల మాకు ఇబ్బంది ఉంది. ఊరికి, ఇళ్లకు దూరంగా పెట్టుకోమని వేడుకుంటున్నాం

# వైసీపీ గుండాల ఆగడాలను సహించేది లేదు: ఎమ్మెల్యే కొండబాబు





**కాకినాడ,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** ప్రజలు వైసీపీ పార్టీని చీకొట్టి తరిమికొట్టిన వైసీపీ గుండాలు ,రౌడీలలో మార్పు రాలేదని, వైసీపీ రౌడీల గుండాల ఆగడాలను సహించేది లేదని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హెచ్చరించారు. దుమ్ముల పేట ప్రాంతానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు సీరం చిన్నా,కోంద్రు తాతారాలపై వైసీపీ నాయకులు మారణాయులతో అర్ధరాత్రి దాడి చేయడంతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వనమాడి కొండబాబు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడ నగరాన్ని గుండాలు, రౌడీలు పాలనగా తయారు చేశారని, ప్రభుత్వం మారిన వారిలో గూండాల సంస్కృతి మారలేదని,సోషల్ మీడియాలో తెలుగుదేశం పార్టీ సమాచారాన్ని పోస్టు చేస్తున్నారని సీరం చిన్న, కోంద్రు తాతారావులపై గత వైసీపీ ప్రభుత్వం అనేక అక్రమ కేసులు బనాయించి వేధించడం జరిగిందని, నేడు జగన్ రెడ్డి గత పాలనలో చేసిన ఆగడాలను అక్రమాలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారని కక్ష గట్టి అర్ధరాత్రి సమయంలో వైసీపీ గూండాలు పేర్ల దుర్గారావు,వాసుపల్లి కృష్ణ,పేర్ల వెంకటేష్, దాసరి సతీష్, తిరిది నూకరాజు కొంత మంది అనుచరులతో కలిసి సిరం చిన్న,కొంద్రు తాతారావులను అర్ధరాత్రి సమయంలో మారణాయుధాలతో దాడి చేసి చంపేయత్నం చేయగా చుట్టు పక్కల ప్రాంతాల వారు చేరుకోవడంతో పరారయ్యారని,సీరం చిన్న కొంద్రు తాతారావులకు తలకు తీవ్ర గాయాలయ్యాయని, కాకినాడ నగరంలో హత్య రాజకీయాలకు ప్రేరేపిస్తున్న వైసీపీ నాయకులపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు,తుమ్మల రమేష్, మూగు రాజు,చోడిపిల్లి సతీష్,ఏరిపిల్లి రాము, కోమటి మసేనమ్మ, కోమటి నూకరాజు, చోడిపిల్లి ప్రేమానందం, ఎరిపిల్లి సత్తిబాబు, అర్జల్ల దాసు,తిరిది ఎల్లయ్యమ్మ,దూడ పావని తదితరులు పాల్గొన్నారు.

# వానపల్లి పల్లాలమ్మ ఆలయం అభివృద్ధికి కార్యాచరణ



**అమలాపురం,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** వానపల్లి పల్లాలమ్మ అమ్మవారి ఆలయ అభి వృద్ధికి ముఖ్య మంత్రి ఇచ్చిన హామీ మేరకు నిర్మాణ పనులు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధమైనట్లు జిల్లా కలెక్టరు మహేష్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్లో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఇంజనీర్లతో ఆలయ అభివృద్ధి ప్రతిపాదనలు అంచనాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆగస్టు 23వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో ఉపాధి హామీ పనుల గ్రామసభల నిర్వహణ సందర్భంగా కొత్తపేట మండలం వాన పల్లి గ్రామ సభకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీ పల్లాలమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారని తెలిపా రు. ఈ ఆలయ సందర్శన సందర్భంగా ఆలయ భక్తుల ప్రయోజనాల దృష్ట్యా వానపల్లి గ్రామస్తులు కోరిన విధంగా అవసరాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగింద న్నారు. ఆలయానికి పార్కు నిర్మాణం, పొంగల్ షెడ్ నిర్మాణం, ప్రహరీ గోడ నిర్మాణం, మరుగు దొడ్లు స్నానాలు గదులు నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంకు తోపాటుగా త్రాగు నీరు ఏర్పాటు,చేసింది ఆలయానికి అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తుల వసతి నిమిత్తం 10 గదులు నిర్మాణం, అంతర్గత రోడ్ల నిర్మాణం, దుకాణాల నిర్మాణం నివేదన శాల,పార్కింగ్ తోపాటు వీధి దీపాలు ఏర్పాట్లపై ప్రతి పాదించినట్లు తెలిపారు. వీటిలో పొంగల్ షెడ్ నిర్మాణం,ఆలయ ప్రహరీ గోడ నిర్మాణం,మరుగు దొడ్లు స్నానాలు గదులు నిర్మాణం కొరకు రూ. 83 లక్షలను దేవాదాయ ధర్మాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ నుండి విడుదల చేస్తుందని తెలిపారు. అయితే పార్కు నిర్మాణానికి సంబంధించి రూపొం దించిన అంచనాలు కామన్ గుడ్ ఫండ్ మార్గదర్శకాలకు అను గుణంగా లేనందున పర్యాటక శాఖ ద్వారా లేదా ఇతర ప్రత్యామ్నాయ నిధుల ద్వారా నిర్మా ణ పనులు చేపట్టడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధి పనులను చేపట్టడానికి తగినంత స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ,ఆలయ అభివృద్ధి పనులు చేసేంత ఆర్థిక స్తోమత లేదని, జలజీవన్ మిషన్ ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. ఆలయంలో గ్రామ దేవత ఆగమం ప్రకారం పూజలు జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తులో ఎటువంటి వరద ముంపు రాకుండా కాలువపై రివిట్మెంట్ గోడ ఎత్తును పెంచాలని, సరి హద్దులు ఏర్పాటుకు పటిష్టమైన చర్యలు గైకొనాలని సూచించారు. కాంపౌండ్ వాల్ కు లైటింగ్ కొరకు ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆలయ ప్రాంగణం అంతా పచ్చదనం నీడ నింపడా నికి వృక్ష జాతి మొక్కలు విరివిగా పెంచాలన్నారు. ఈ అభివృద్ధి పనులు అన్నింటిని రానున్న డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ డి ఎల్. వి రమేష్ బాబు, కార్యని ర్వాహక ఇంజనీర్ టి. దుర్గేష్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్య నారాయణ,స్పెషల్ డి ప్యూటీ కలెక్టరు వి మదన్ మోహన రావు, తదితరులు పా ల్గొన్నారు.

# చల్లపల్లి కేంద్రంగా పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధి..

- గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం అనుబంధ పరిశ్రమలు చల్లపల్లిలో ఏర్పాటుకు కృషి
- ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ వెల్లడి





**చల్లపల్లి: అవనిగడ్డ,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** పారిశ్రామిక, ఐటీ రంగాలకు కేంద్రబిందువుగా చల్లపల్లిని అభివృద్ధి చేస్తానని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం చల్లపల్లిలో రూ.కోటి 27 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి బుద్ధప్రసాద్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి అనువుగా ఉన్న చల్లపల్లిలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల నాగాయలంక మండలం గుల్లలమోదకు మంజూరు చేసిన క్షిపణి పరీక్ష కేంద్రం నిర్మాణం ప్రారంభమైతే దానికి అనుబంధంగా వచ్చే పరిశ్రమలు చల్లపల్లిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. గత వైకాపా ప్రభుత్వ సహకారం లేకపోవడంతో గుల్లలమోదలో క్షిపణి పరీక్ష కేంద్రం నిర్మాణం ఐదేళ్లు ఆలస్యం అయిందన్నారు. దీనికి తోడు గత ప్రభుత్వంలో చల్లపల్లిలో ఏకైక పరిశ్రమగా ఉన్న కెసిపి చక్కెర కర్మాగారం మూతబడిందన్నారు. ఈ నేపథ్యంలో అవనిగడ్డ నియోజవర్గం నుంచి ఉన్నత విద్య అభ్యసిస్తున్న యువత కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తాను ఎమ్మెల్యే అయిన మొదటి రోజు నుంచి గుల్లలమోద క్షిపణి పరీక్ష కేంద్రం ఏర్పాటు కోసం అనునిత్యం కృషి చేయడం ద్వారా కేవలం 100 రోజుల్లోనే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో గుల్లలమోద క్షిపణి పరీక్ష కేంద్రం మంజూరు చేసిందన్నారు. దీనికి తోడు చల్లపల్లి కేంద్రంగా ఐటీ రంగాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తమ కూటమి ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపరిచేందుకు, గ్రామీణ మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కృషి జరుగుతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.4,500 కోట్లతో రాష్ట్రంలో 30 వేల అభివృద్ధి పనులు చేపట్టి, మూడు వేల కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. నిధులను ఎలా వినియోగించాలో తెలియని వ్యక్తి జగన్ పరిపాలన ఫలితంగానే రాష్ట్రంలో గ్రామాలలో రోడ్లన్నీ బురద గుంటలుగా మారాయని విమర్శించారు. తమ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో 48.730 కిలోమీటర్లు పొడవున 496 సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. చల్లపల్లి మండలంలో రూ.మూడు కోట్ల 69 లక్షల 55 వేలతో మంజూరు అయిన 5,933 మీటర్లు పొడవైన 59 సీసీ రోడ్లు, అదనంగా మంజూరు అయిన రూ.కోటి 80 లక్షల 65 వేలతో 3,010 మీటర్లు పొడవున 31 సీసీ రోడ్లు మొత్తం రూ.ఐదు కోట్ల 50 లక్షల 20 వేలతో 8,943 మీటర్లు పొడవున 90 సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు వివరించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తుంగల వెంకటగిరి, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీడీఓ డాక్టర్ అనగాని వెంకటరమణ, పంచాయతీరాజ్ డీఈఈ పగడాల సురేష్ బాబు, ఏఈఈ బొప్పన శ్రీనివాసరావు, ఉపాధి పథకం ఏపీఓ రాజ్ కుమార్, మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, పాగోలు ఎంపీటీసీ మేకా సత్యనారాయణ ప్రసాద్ (బంగారుబాబు), పంచాయతీ కార్యదర్శి పీవీ మాధవేంద్రరావు, గ్రామ పెద్దలు పత్రి హనుమంతరావు, వుడత్తు బాబు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, కూటమి నాయకులు రావి చిట్టి, రావి రాజు, జీవీ తాతారావు, కోట సత్యం, పద్మావతి, తాతినేని విజయసారధి, నిడమానూరు దిలీప్ కుమార్ ,షేక్ సిలార్, తుటారం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# బంటుమిల్లిలో డిస్లేక్సియా అవగాహన వారోత్సవాలు




**కృత్తివెన్ను,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలలో నిర్వహించబడే డిస్ లెక్సియా అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్థానిక బంటుమిల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఉన్న భవిత సెంటర్ వారు అవగాహన సదస్సును ఏర్పాటు చేసి తదనంతరం ర్యాలీని నిర్వహించడం జరిగింది. బంటుమిల్లి ఎంఈఓ 1 త్రిపుర సుందరి దేవి మరియు ఎంఈఓ 2 వెంకటేశ్వరరావు బంటుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జ్యోతి... ఐఇఆర్పి నవీన్ ల ఆధ్వర్యంలో డిస్ లెక్సీయా వారోత్సవాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ డిస్లెక్సియా అను వ్యాధితో బాధపడు పిల్లలు పదాలలో గల అక్షరాల క్రమాన్ని గుర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని వాటిని ఉచ్చరించడంలో, స్పెల్లింగులను గుర్తించుకోవటంలో, కథలను ఏవైనా సంఘటనలను వివరించి చెప్పడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని.... ఇటువంటి లక్షణాలతో ఇబ్బంది పడే పిల్లలను గుర్తించి వారికి వెంటనే సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా ఆశించిన స్థాయిలో మార్పును తీసుకు రావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఆయాలు, భవిత సెంటర్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్దే లక్ష్యం గా పనిచేస్తా ఎమ్ ఎల్ ఎ కాగిత



**కృత్తివెన్ను,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బంటుమిల్లి మండలం నాగేశ్వరావుపేట మరియు మల్లేశ్వరం గ్రామాల్లో నిర్వహించిన సభలలో స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ హాజరై ఆయా గ్రామాల్లో సిమెంటు రోడ్ల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్లపాటు రాక్షస పాలన చూసిన ప్రజలు... నేడు కూటమి ప్రభుత్వ ప్రజా పాలన చూస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేందుకు నిరంతరం తాను కృషి చేస్తానని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను పరిష్కరించడమే తన లక్ష్యమని మరీ ముఖ్యంగా ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడం రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెడతానని పేర్కొన్నారు. రాష్ట్రంలో కుప్పకూలిన వ్యవస్థలను గాడిలో పెడుతూ రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహాకూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గ్యార్వి ఉత్సవంలో పాల్గొన్న బీసీ ఐక్యవేదిక "భేరి"



**హైదరాబాద్,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** గచ్చిబౌలి డివిజన్ బాపూనగర్, ఈ హర్క మసీద్ దగ్గర, గుల్మోహన్ పార్క్ ఎదురుగా బాపూనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్వి షరీఫ్ ముభారక్ ఉత్సవాల్లో బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ గ్యార్వి షరీఫ్ పండుగను ముస్లింలు హిందువులు మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకుంటారని అన్నారు. ఎంతో పవిత్రంగా కొలిచే గ్యార్వి షరీఫ్ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఐక్యమత్యంగా శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు. భారతదేశంలో అన్ని కులాలకు అన్ని మతాలకు చోటు ఉందని అందరం కలిసి ఐకమత్యంగా అన్ని పండుగలను సంతోషాలతో వేడుక జరుపుకుందామని అన్నారు. ఈ భూమి మీద ఎవరు శాశ్వతం కాదని ఎవరి నమ్మకం వారిదని అందరి దేవుళ్ళను గౌరవించాలని ఈ సందర్భంగా తెలియజేశారు గార్వి షరీఫ్ ఉత్సవం కార్యక్రమ నిర్వాహకులు షేక్ ఆసిఫ్, షేక్ మొయినుద్దీన్, ఎండి ముఖరం, ఎండి ఇర్ఫామ్, సయ్యద్ ఖదీర్, మహమ్మద్ అస్లం, ఎండి హాడు, మరియు బాపు నగర్ కాలనీ పెద్దలు యువకులు మహిళా సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# వీరుల పాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



**వీరులపాడు,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కోటేరు లక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈసందర్భంగా ఏం.పి.పి. లక్ష్మి మాట్లాడుతూ మండలం కు 25 హాండ్ బోర్లు మంజూరు అయ్యాయని వాటిని ఏం.పి.టి.సి.,సర్పంచ్ లు సద్వినియోగం చేసుకోవాలనీ కోరారు. అలాగే మండల పరిషత్ గ్రాంటు మరో రూ.25. లక్షలు నిధులు ఉన్నాయని, వాటిని ప్రజా ప్రతినిధులు డ్రెయినేజీ లకు,కల్వర్టు ల నిర్మాణా పనులు చేసు కోవచ్చు నాని,ప్రాధాన్యత క్రమం లో వినియోగించు కొవాలని ప్రజా ప్రతినిధులకు ఏం.పి.పి. సూచించారు..

# ఆలపాటి రాజా గెలుపే లక్ష్యంగా పట్టభద్రుల ఓటింగ్ ప్రక్రియ

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సత్తా చాటాలి
- మూల్పూరి సాయి కళ్యాణి తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 16 (వార్తాప్రభ) :** రాబోయే కృష్ణా-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ను గెలిపించి కూటమి సత్తా చాటాలని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మూల్పూరి సాయి కళ్యాణి పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా, బాపులపాడు మండలంలోని హనుమాన్ జంక్షన్ లో గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఓట్లు నమోదు కార్యక్రమాన్ని సాయి కళ్యాణి ఆధ్వర్యంలో బుదవారం నాడు చేపట్టారు. ఈ సందర్భంగా సాయి కళ్యాణి మాట్లాడుతూ, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఎంతో అనుభవం కలిగిన నాయకులని, అటువంటి వ్యక్తిని మనం గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని, అందుకోసం నియోజకవర్గం వ్యాప్తంగా ప్రతి వార్డుల్లో, గ్రామాల్లో ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క పట్టభద్రులు నవంబర్ 6వ తేదీ లోపల ఆన్లైన్ లేదా నేరుగా ఎమ్మార్వో కార్యాలయంలో ఫోరమ్ అందించవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంశి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో విద్యారంగం

**విద్యను అట్టడుగు వర్గాలకు దూరం చేస్తున్న ప్రభుత్వాలు**
**బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్**



**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి):** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల చర్యల వల్ల అట్టడుగు కులాల,అట్టగుడు వర్గాల విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం పొంచి ఉందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యెర్రా కామేష్ విమర్శించారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటూ విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్నదని ప్రజా పాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మూస ధోరణిని అవలంబిస్తున్నదని,విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయిస్తామని మ్యానిపెస్టోలో ప్రకటించి బడ్జెట్ లో కేవలం 7.3 శాతం నిధులను మాత్రమే కేటాయించిందని,అదేవిదంగా 2014 బడ్జెట్ లో విద్యారంగానికి కేంద్రంలోని మోడీ సర్కార్ 6 శాతం నిధులను కేటాయించగా..2024 నాటికి అవి 2.5 శాతానికి తగ్గించారని పేర్కొన్నారు.రాష్ట్రంలో ఇప్పటికీ ఉన్న సుమారు 30 వేలకు పైగా పాఠశాలల్లో వసతులు కల్పించి,వాటిని అభివృద్ధి చేయకుండా నియోజకవర్గానికో ఇంటర్నేషనల్ స్కూల్ స్థాపిస్తామని,మండలానికో సమీకృత పాఠశాలను ఏర్పాటు చేస్తామంటూ కాలయాపన చేస్తుందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి గత పది నెలల కాలంలో విద్యారంగంలో వచ్చిన,వస్తున్న మార్పులు ప్రభుత్వ విద్యను బలహీన పర్చేలా ఉన్నాయని,పేదలకు,మధ్యతరగతికే కాకుండా ఎగువ మధ్యతరగతి వారికి కూడా విద్యను దూరం చేసే విధంగా ఉన్నాయని వీటి వల్ల అభ్యాసన సంక్షోభం ఇంకా తీవ్రమయ్యే ప్రమాదం ఉందన్నారు.

# జర్నలిస్టు నేత నర్సింగ్ రావుకు నివాళులు



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, ఈనాడు రిపోర్టర్ ఎర్రం నర్సింగ్ రావు ప్రథమ వర్ధంతి బుధవారం కవాడిగూడలోని ఆయన నివాసం వద్ద జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, హెచ్ యూజే కార్యనిర్వాహక కార్యదర్శి నాగవాణి తదితరులు పాల్గొని నర్సింగ్ రావు చిత్ర పటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, నర్సింగ్ రావు జ్ఞాపకాలను గుర్తు చేశారు. నర్సింగ్ రావు ఒక జర్నలిస్టుగా, ఫెడరేషన్ నాయకుడిగా సమాజానికి, జర్నలిస్టులకు చేసిన సేవలను ఆయన కొనియాడారు. నర్సింగ్ రావు లేని లోటు పూడ్చలేనిదని, ఆయన మరణం అత్యంత విషాదకరమని అన్నారు.

## పిసిసి అధ్యక్షుడు కి దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధంరాజు లు



**కూకట్ పల్లి,అక్టోబర్16 (వార్తప్రభ):**దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్ పల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి దినేష్ కుమార్, కెపిహెచ్బి కాలనీ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గంధం రాజు లు బుధవారం తెలంగాణ పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ని ప్రత్యక్షంగా కలుసుకొని వారిని ఘనంగా దసరా పండుగ సందర్భంగా సత్కరించారు.

## మందమర్రి లో జాతీయ బిసి సంక్షేమ సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలబిషేకం.

**మందమర్రి అక్టోబర్16 (వార్తప్రభ):** మంచిర్యాల జిల్లాలోని మందమర్రి పట్టణంలో గల అంబేద్కర్ విగ్రహానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం మందమర్రి పట్టణ నాయకులు పూలాభిషేకం చేశారు అనంతరం బీసీ సంక్షేమ సంఘం మందమరి గౌరవ అధ్యక్షులు పోలు శ్రీనివాస్ మందమర్రి పట్టణ అధ్యక్షుడు సకినాల శంకర్. మాట్లాడుతు.తెలంగాణలో బిసి కుల గణన జీవనం ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కి ముందుగా ధన్యవాదాలు తెలియజేస్తూ అలాగే రాహుల్ గాంధీ జూడయాత్రలో తెలంగాణ రాష్ట్రంలో కుల గల ప్రక్రియ ఎన్నికల తరువాత ప్రారంభిస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారని ఆ మాట ప్రకారమే కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులదన్న ప్రక్రియ 18వ జీవోను విడుదల చేయడం చాలా సంతోషకరమని అన్నారు.

# "పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి- జిల్లా పశు వైద్యాధికారి" డాక్టర్ వి. కృష్ణయ్య

**అడ్డగూడూరు: అక్టోబర్ 16 (వార్త ప్రభ )**పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా పంపిణీ చేస్తున్న నివారణ టీకాలను పశువులకు వేయించుకోవాలని రైతులతో, పశు పోషకులతో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వి. కృష్ణయ్య అన్నారు. అడ్డగూడూరు మండల కేంద్రంలోని పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం పశువులకు గాలికుంట వ్యాధుల సోకకుండా నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి వి కృష్ణ మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి అనేది ప్రమాదకరమని ఈ వ్యాధి సోగిన పశువులకు నోటిలో,కాళ్లలో పుండ్లు ఏర్పడి మేత మెయ్యక నడవలేని స్థితిలో పశువులు ఉంటాయన్నారు. రైతులు, పశుపోషకులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించి వ్యాధి సోకకుండా కాపాడుకోవాలని అన్నారు. అడ్డగూడూరు మండల కేంద్రంతో పాటు పరిసరాల్లో ఉన్న గ్రామాలలో ఈనెల 15 నుంచి నవంబర్14 వరకు నెల రోజులపాటు పశు వైద్య సిబ్బంది గ్రామాలలో పర్యటించి ఆవులు, ఎద్దులు, గేదెలకు ఉచిత గాలికుంటూ టీకాలు వేస్తారని అన్నారు. పశువులకు టీకాలు వేయించిన రైతుల పేర్లు ఆన్లైన్లో నమోదు చేయాలని పశు వైద్య సిబ్బందికి తెలియజేశారు. ఈ యొక్క అవకాశాన్ని రైతులు, పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో



అడ్డగూడూరు మండల పశు వైద్యాధికారి అనిల్ రెడ్డి, వీఎల్ఏ శ్రీరాములు , వి ఏ ఈశ్వరయ్య , గోపాలమిత్ర (సీనియర్ ) బండి కొమురయ్య, రైతులు, పశు పోషకులు తదితరులు పాల్గొన్నారు.

# అభాగ్యులకు ఆర్థిక భరోసానిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి - ఏం.ఎల్. ఏ .



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 16 (వార్తాప్రభ):**గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్ రాంగుడా కి చెందిన భగవాన్ దాస్ కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా (సీఎంఆర్ఎఫ్- ఎల్ఓసి) ద్వారా మంజూరైన 70,000 /- డెబ్బై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్- ఎల్ఓసి మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి అందచేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరి అయినవి అని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.అదేవిధంగా ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పీఏసీ చైర్మన్ గాంధీ పునరుద్ఘాటించారు.అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని,అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు,అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని.. పీఏసీ చైర్మన్ గాంధీ గారు ఈ సందర్భంగా తెలియచేశారు.ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్,చంద్రశేఖర్,సంతోష్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

- **అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి గాడిపెల్లి ప్రమీల**



**తొర్రూరు అక్టోబర్ 16(వార్తా ప్రభ)** దేశంలో ప్రభుత్వాలు మహిళా సహదికారతను సాధించమని గొప్పలు చెప్పుతూ , మహిళల పై జరుగుతున్న అత్యాచారాలు దాడులను నియంత్రించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని... మహిళల ను ఐక్యం చేసి మహిళల హక్కులకై ఉద్యమించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గాడిపెల్లి ప్రమీల పిలుపునిచ్చారు. బుధవారం తొర్రూరు మండల కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయం పైన 2వ ఐద్వా మండల మహాసభ సందర్భంగా సంఘం సీనియర్ సభ్యురాలు పొడగంటి ఎల్లమ్మ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంగం మండల అధ్యక్షురాలు బోర మణమ్మ అధ్యక్షతన జరిగిన మండల మహాసభలో గాడిపెల్లి ప్రమీల మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు అత్యాచారాలను నియంత్రించడంలో విఫలం కావడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం అత్యాచారాలు చేసిన వారిని కాపాడుతూ సన్మానాలు చేయడం విడ్డూరమని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ప్రవేశపెట్టిన కొన్ని ప్రత్యేక చట్టాలు క్రింది స్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలు ప్రతి మహిళకు 2500 రూపాయల నగదు, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పెంచి ఇవ్వడంతోపాటు తులం బంగారం అందజేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేసి మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. అక్టోబర్ 21, 22, 23 వ తేదీలలో కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను మహిళలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐద్వా తొర్రూరు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా బోర మణెమ్మ, కార్యదర్శి బొల్లం మమత, ఉపాధ్యక్షురాలు, పెరుమాండ్ల సరోజన, సహాయ కార్యదర్శి పొడగంటి ఎల్లమ్మ, కోశాధికారి యనమాల శైలజ, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి ప్రకటించారు. ఈ మహాసభలో సంఘం సభ్యులు దొమ్మాటి యాకమ్మ, తిమ్మిడి రమ, రమాదేవి, గుద్దేటి స్వరూప, ధరావత్ సునీత, డొనుక ఏకాంత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# గుత్తా సుఖేందర్ రెడ్డితో మర్యాదపూర్వక భేటీ అయిన కొయ్యే మోషేన్ రాజు



**రెండు రాష్ట్రాల తాజా రాజకీయ పరిణామాలపై శాసనమండలి చైర్మెన్ల మధ్య చర్చ**

**హైదరాబాద్ అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు హైదరాబాద్ లో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ శాసన మండలిని ఆయన సందర్శించడం జరిగింది. తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయన్ని సాదరంగా ఆహ్వానించి శాలువతో సత్కరించారు. చాలా సేపు రెండు రాష్ట్రాల తాజా రాజకీయపరిణామాలపై ఇరువురు చర్చించుకున్నారు .ఈ కార్యక్రమంలో తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డా.నరసింహాచార్యులు కూడా పాల్గొన్నారు.

## అన్ని తనే అయ్యి ట్రాఫిక్ విధులు నిర్వహించిన సిఐ. ముత్తు యాదవ్



**కూకట్ పల్లి,అక్టోబర్16 (వార్తప్రభ):**వర్షం పడితే చాలు వడ్డేపల్లి ఎన్క్లేవ్ వద్ద నిత్యం వర్షపు నీరు నిలిచి ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది దీనిలో భాగంగా బుధవారం సాయంత్రం సమయంలో ఒక్కసారిగా వాతావరణం మరి వర్షం పడడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డు మొత్తం గుంతల మయం కావడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది దీనితో విషయం తెలుసుకున్న కూకట్ పల్లి ట్రాఫిక్ సిఐ ముత్తు యాదవ్ ట్రాఫిక్ ను పునరుద్ధరించారు. సాయంత్రం సమయం కావడంతో ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో రోజు ఇదే తీరుగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని దీనిపైన సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కొత్త రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని స్థానిక కాలనీవాసులు వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు

## పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ గౌష్ ఆలం.



**ఆదిలాబాద్ అక్టోబర్16 (వార్తప్రభ):** జిల్లా కేంద్రంలోని జిల్లా శిక్షణ కేంద్రం నందు శిక్షణ తీసుకుంటున్న కానిస్టేబుల్ లకు రెండవ సెమిస్టర్ చివరి పరీక్షలు ఉన్నందున జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ ఈరోజు ఉదయం పరీక్షా కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. 9 నెలల పాటు శిక్షణను తీసుకొని చివరి రాత పరీక్షలను రాస్తున్న 254 మంది శిక్షణ కానిస్టేబుళ్ళు. నాలుగు రోజులపాటు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ప్రతి ఒక్కరు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణులు కావాలని జిల్లా ఎస్పీ కోరుకున్నరు. నిజామాబాద్ నుండి విచ్చేసిన ప్రత్యేక పరీక్షల నిర్వహకులు ఆదిలాబాద్ జిల్లా లోని శిక్షణ కానిస్టేబుల్ లకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈరోజు ఉదయం భారతీయ న్యాయ సంహిత,భారతీయ సాక్ష్య అధినీయం,బిఎస్ఏ లలో పరీక్షను శిక్షణ కానిస్టేబుల్ రాస్తున్నట్లు మిగిలిన వాటిలో తదుపరి మూడు రోజులు పరీక్షలు ఉండబోతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ సి సమయ్ జాన్ రావు, నిజామాబాద్ సిటిసి ఎసిపి సయ్యద్ మస్తాన్ అలీ,ఆర్ఐ కార్తీక్,ఆర్ఎస్ఐ రాకేష్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## "మేక్ ఇన్ ఇండియా" ద్వారా తగినంత యూరియా ఉత్పత్తి!!

**పలు రాష్ట్రాలకు సరఫరాలో ఆర్.ఎఫ్.సి.ఎల్. ప్రత్యేక శైలి**
**ఆర్.ఎఫ్.సి.ఎల్. చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ రాజహంస**




**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)** "మేక్ ఇన్ ఇండియా" ద్వారా తగినంత యూరియా ఉత్పత్తి చేసే సంస్థగా రామగుండం ఎరువుల కర్మాగారం నిలుస్తూ... సకాలంలో తెలంగాణ రాష్ట్రంతో పాటుగా పలు రాష్ట్రాలకు యూరియా సరఫరా చేస్తున్న కంపెనీగా కీలక పాత్ర పోషించడం శుభ పరిణామం అని సంతోషం వ్యక్తం చేశారు ఆ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ రాజ హంస. ఈ మేరకు బుధవారం హైదరాబాదులోని రాజ్ భవన్ లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతో నిర్వహించిన పరిచయ సమావేశంలో చీఫ్ జనరల్ మేనేజర్ మాట్లాడారు. దేశంలో వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం కోసం మీకు ఇన్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా రామగుండంలో నిల కలిపిన ఎరువుల కర్మగారం ఉత్పత్తిలో ప్రథమ శ్రేణిలో నిలవడం గమనార్హం అని అన్నారు. కొత్త వ్యక్తులను కలుసుకోవడం, సహకారాలు, ఆలోచనల మార్పిడిని ప్రోత్సహించే విధంగా అధికారులను ఒకచోట చేర్చే ఇంటరాక్టివ్ మీట్ దేశ అభివృద్ధికి మెట్లు అని ప్రశంసించారు.

## సింగరేణిలో ఖుషి ఖుషీగా "బడా ఖానా"!!

- **కార్మికుల మధ్య యూనిటీకై గొప్ప కార్యక్రమం**
- **రామగుండం కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు గట్ల రమేష్**




**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**సింగరేణిలో ఖుషి ఖుషీగా "బడా ఖానా" పేరుతో సహపంక్తి భోజన కార్యక్రమాలు గత రెండు రోజులుగా ఘనంగా కొనసాగుతున్నవి. ఈ మేరకు బుధవారం పవర్ హౌస్ సివిల్ డిపార్ట్మెంటులో ఏర్పాటుచేసిన బడా ఖానా కార్యక్రమంలో నాయకులు రమేష్ పాల్గొని మాట్లాడారు. కార్మికుల మధ్య యూనిటీకై సింగరేణి సంస్థ నిర్వహిస్తున్న బడా ఖానా గొప్ప కార్యక్రమం అని కొనియాడారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సింగరేణి కార్మికుల గుండెచప్పుడుగా ఉంటూ సమస్యలు పరిష్కరిస్తున్నారు అని ప్రశంసించారు. కార్యక్రమంలో సివిల్ డిపార్ట్మెంట్ అధికారి వరప్రసాద్, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవం -రాగం అనిరుధ్ యాదవ్



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 16 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి డివిజన్ లోగల లింగంపల్లి విలేజ్,బాపునగర్ లలో నిర్వహించిన గ్యార్వి షరీఫ్ ముబారక్ వేడుకలో ముఖ్య అతిధులుగా రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ పాల్గొన్నారు.ముస్లిం సోదరులు వారిని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా అనిరుధ్ యాదవ్ మాట్లాడుతూ..మత సామరస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవమని,అందరూ సామరస్యంగా జరుపుకునే వేడుక అని,ఎంతో పవిత్రంగా కొలిచే గ్యార్వి షరీఫ్ ఉత్సవం ను భక్తి శ్రద్ధలతో,శాంతి యుతంగా జరుపుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో లింగంపల్లి విలేజ్ ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్,కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్,గఫ్ఫూర్, అజీమ్,సాయి,ముంతాజ్ బేగం,ముజఫీర్,మొయిన్, మొయిస్,అజర్ ,రెహానాబేగం,షాదిక్,ముక్రమ్,ఆసిఫ్,అస్లాం,జుబేర్,ఖదీర్,అజర్, సల్మాన్,ఇజాజ్,సోహిల్,వసీమ్, ఇజాం,సమీర్,ముబీన్,కరీం,తదితరులు పాల్గొన్నారు.

## మల్కాపూర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

**కామారెడ్డి అక్టోబర్16 (వార్తప్రభ)**కామారెడ్డి జిల్లా బిబిపేట మండలం మల్కాపూర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఉమ్మడి జిల్లా వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు సెంటర్ ను ప్రతి దగ్గర ఏర్పాటు చేస్తామని ఆయన మాట్లాడుతూ ఒక్క బస్తాకు 41 చొప్పున కాంట పెట్టడం జరుగుతుంది, రైతు నుండి జాలి పట్టి ప్రభుత్వం నిర్ణయం ప్రకారం సన్న వడ్లు 500 బోనస్ ఇవ్వడం ఇస్తారని ఆయన చెప్పడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రమేష్ కు బీబీపేట మండలం నుండి సన్మానం చేయడం జరిగింది.

# ఎడిటోరియల్

## భారత్ మీద జస్టిన్ పోరు వెనుక ఆ వ్యూహమే కారణమా?

ఇప్పుడున్న పరిస్థితుల్లో భారతదేశం లాంటి దేశంతో మరో దేశం ఎందుకు గొడవ పెట్టుకుంటుంది? అంతర్జాతీయ సరిహద్దుల పంచాయితీ కానీ.. మరో చికాకు కానీ లేనప్పుడు.. మన దేశానికి అక్కడెక్కడో సదూరాన ఉన్న కెనడా.. దాని అధినేత మనతో గొడవకు ఎందుకు దిగుతున్నాడు? ఏడాది క్రితం జరిగిన పంచాయితీని పట్టుకొని ఎందుకంతగా ప్రాకులాడుతున్నాడు. అందరూ ఆశ్చర్యపోయేలాఆయన వ్యవహారశైలికి కారణం ఏమిటి? ఏ ప్లాన్ తో ఇదంతా ఆయన చేస్తున్నట్లు? భారతదేశంలో పంచాయితీ పెట్టుకుంటే ఆయనకు వచ్చే లాభం ఏమిటి? సరైన కారణం లేకుండానే ఆంక్షల కత్తిని బయటకు తీసిన జస్టిన్ ట్రూడో బెదిరింపులకు ఎందుకు దిగుతున్నట్లు? దాని వెనుకున్న అసలు సంగతి ఏమిటన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదంతా ఎందుకు చేస్తున్నట్లు అన్న అంశాన్ని ఒక్క లైన్ లో చెప్పాలంటే.. దేశ అంతర్గత రాజకీయాలే కారణంగా చెబుతున్నారు. 2 రోజుల క్రితం కెనడా పార్లమెంటులో చోటు చేసుకున్న వ్యతిరేక పరిణామాల నుంచి తన దేశ ప్రజల చూపును పక్కకు తిప్పేలా.. తనను తాను సమర్థుడిగా చాటింపు చేసుకునేందుకే భారతదేశంతో కొత్త పంచాయితీ పెట్టుకున్నట్లుగా విశ్లేషిస్తున్నారు. అధికారం మీద పట్టు కోల్పోతుండటం.. దేశ ప్రజలతో పాటు.. సొంత పార్టీలోనూ వ్యతిరేకత.. వీటన్నింటి నుంచి తప్పించుకోవటానికి ఒక సంచలన ఘటన కెనడా ప్రధానికి అవసరం. అందుకే ఆయన కోల్డ్ స్టోరేజీలో ఉన్న నిజ్జర్ హత్య కేసును బయటకు తీసి భారతదేశం మీద నిందలు మోపే ప్రోగ్రాంకు తెర తీసినట్లుగా చెప్పాలి. ట్రూడో రాజేసిన వివాదం వెనుక అసలు లెక్కలు ఉన్నాయని చెప్పొచ్చు. భారత ప్రభుత్వ ఏజెంట్లు కెనడా వాసులకు ప్రాణాంతకంగా మారారన్న ప్రచారం చేసుకోవటం.. అలాంటి వారి విషయంలో తానెంత కఠినంగా ఉన్నానన్న విషయాన్ని నమ్మించే ప్రోగ్రాంలో భాగంగా ఈ పంచాయితీ అంతా చోటు చేసుకుందన్న మాట వినిపిస్తోంది. ట్రూడో ప్రాతినిధ్యం వహిస్తున్న లిబరల్ పార్టీ 2015లో పవర్ లోకి వచ్చిన రెండేళ్ల నుంచే ప్రజాభిమానాన్ని కోల్పోయింది. 2017లో అగాఖాన్ సంస్థ నుంచి బహుమతుల రూపంలో ప్రయోజనాలు పొందటం.. 2019లో ఎస్ ఎన్ సీ – లవలిన్ స్కాం.. బ్లాక్ ఫేస్ వివాదం లాంటివి ట్రూడో ఇమేజ్ ను డ్యామేజ్ చేశాయి. 2019 వచ్చే నాటికి ఆ పార్టీ బలం బాగా తగ్గిపోయింది. చివరకు మిత్రపక్షాల మీద ఆధారపడి.. బండి లాగే పరిస్థితి. ఇలాంటి వేళ.. ఆర్థిక మంత్రి బిల్ తో పంచాయితీ మొదలైంది. చివరకు బిల్ తన పదవికి రాజీనామా చేశారు. 2021లో పూర్తి మెజార్టీ ఖాయమని నమ్మి ఎన్నికలకు వెళ్లి దెబ్బ తిన్నాడు ట్రూడో. పూర్తి మెజార్టీ ఖాయమని నమ్మిన దానికి భిన్నంగా మైనార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి బండి లాగిస్తున్న పరిస్థితి. ఈ ఏడాది జులైలో జరిగిన ప్రత్యేక ఎన్నికల్లో పార్టీకి బాగా పట్టున్న సీట్లలోనూ ఓడిపోవాల్సి వచ్చింది. దేశ ప్రధానిగా ట్రూడో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఆయన నాయకత్వం మీద నిర్వహించిన పోల్స్ లో కేవలం 26 శాతం మంది మాత్రమే ఆయన్ను ప్రధానిగా చూడాలనుకుంటున్న వైనం వెలుగుచూసింది. ఈ పోల్ లో ట్రూడో కు ఎదురైన మరో షాక్ ఏమంటే.. ప్రతిపక్ష నేత కం కన్జర్వేటివ్ పార్టీ నేత పెర్రీ పోయిలీవ్రే సాధించిన (45 శాతం) ఓట్ల శాతం కంటే ఏకంగా 19 శాతం తక్కువ కావటం ట్రూడోను ఇబ్బంది పెడుతోంది. దీంతో ట్రూడో ప్రభుత్వం పతనం అంచున ఉందన్న వాదనను సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఇంతకాలం ట్రూడో ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న న్యూడెమోక్రటిక్ పార్టీ గత నెలలోనే తన మద్దతును ఉపసంహరించుకున్నట్లుగా ప్రకటన చేసింది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. రెండు, మూడు రోజుల క్రితం ట్రూడోకు వ్యతిరేకంగా ఆ దేశ పార్లమెంట్ లో సొంత పార్టీకి చెందిన వారే సంతకాలు సేకరణ చేపట్టినట్లుగా వార్తలు వస్తున్నాయి. భారీ ఎత్తున లిబరల్ పార్టీ ఎంపీలు ఇందులో పాలు పంచుకోవటం.. వచ్చే ఏడాది అక్టోబరులో జరిగే ఫెడరల్ ఎన్నికలకు ఈ సంకేతాలు ఏ మాత్రం మంచివి కావన్న విషయం సొంత పార్టీ నేతలకు అర్థమైంది. దీంతో.. అందరి చూపు తన మీద నుంచి మళ్లేందుకు వీలుగా పాత పంచాయితీని సరికొత్తగా తెర మీదకు తీసుకొచ్చారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కెనడాలో 7.70 లక్షల మంది సిక్కు ఓటర్లు ఉన్నారు. వారిలో కొద్దిమంది బలమైన వ్యక్తులు భారత్ లో వేర్పాటు వాదానికి మద్దతు పలుకుతున్నారు. ఇలాంటి వారిని మచ్చిక చేసుకోవటానికి ట్రూడో ఖలిస్థానీ అనుకూల వైఖరికి తన మద్దతు ఇస్తున్నారు. ఇందుకోసం రెండు దేశాల మధ్యనున్న సంబంధాలు దెబ్బ తీసే పరిస్థితిని కూడా లెక్క చేయటం లేదు. ఇందుకోసం ఆయన ఇప్పటికే గీతలు దాటేశారు. 2018లో మన దేశ పర్యటనకు వచ్చిన ట్రూడో.. పంజాబ్ మంత్రిని హత్య చేసేందుకు కుట్ర పన్నిన ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్పాల్ అత్వాల్ ను కెనడా హైకమిషనర్ డిన్నర్ కు ఆహ్వానం పలకటం ఒక ఉదాహరణగా చెప్పొచ్చు. 2023 జీ20 సమావేశాల తర్వాత కెనడా సర్కారు నిజ్జర్ హత్య వివాదాన్ని షురూ చేసింది. ఫెడరల్ ఎన్నికలకు ఏడాది మాత్రమే టైం ఉన్నవేళ.. ఓటర్ల చూపు మరల్చేందుకు.. మొన్నటి వరకు మిత్రపక్షంగా ఉన్న ఎన్ డీపీ మద్దతును సొంతం చేసుకోవటానికి వీలుగా తాజా వివాదాన్ని తెర మీదకు తెచ్చినట్లుగా అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## త్వరలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీల నియామకం

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 16(వార్తా ప్రభ ప్రతినిధి):–** త్వరలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీల నియామకం చేపట్టనున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదేశాలతో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గం,మండల, పట్టణ మరియు గ్రామ కమిటీలు,పార్టీ అనుబంధ సంస్థ కమిటీలు రద్దు చేసినట్లు తెలిపారు. త్వరలో జిల్లా కాంగ్రెస్ సమావేశం ఏర్పాటు చేసి పార్టీ పెద్దల సహకారంతో అన్ని కమిటీలు నియమిస్తామని అన్నారు. దేశానికి రాహుల్ ప్రధాని అవ్వాలిసిన అవసరం ఉందని దేశం లో వున్న అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని,యువత మరియు విద్యావంతులు ఇప్పటికీ ఐన ఆలోచించాలని సూచించారు.పార్టీని అధికారంలోకి తీసుకురావటానికి పార్టీ లోకి వచ్చి పార్టీ బాధ్యతలు స్వీకరించి పార్టీ ని బలోపేతం చేసి, పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చి రాహుల్ కు మరియు పార్టీ కి అండగా నిలువాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మాజీ ప్రధాన కార్యదర్శికి పోతురాజు ఏసుదాస్, అక్కల నాగేంద్ర ప్రసాద్, చెరుకు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



## వాయుగుండం ప్రభావంతో మండలంలో జోరుగా కురుస్తున్న వర్షాలు

### వర్షాల ప్రభావంతో ముందస్తు చర్యలు చేపట్టిన ఎమ్మార్వో సోమ్లా నాయక్





**సంగం, అక్టోబర్ 16 (వార్తప్రభ):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో మండల వ్యాప్తంగా ఏడతెరిపి లేకుండా జోరుగా పడుతుంది. వర్షంతో పలు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుండి బ్యారేజీకి స్వల్పంగా వరద నీరు చేరుతుంది. ఇప్పటికే లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికార యంత్రాంగం. పెన్నా పరివాహక గ్రామాలైన కోలగట్ల, వీర్లగుడిపాడు గ్రామాలలో ఇప్పటికే బోట్లను ఏర్పాటు చేసిన ఏమ్మార్వో సోమ్లా నాయక్. మండలంలో పలు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి అక్కడ ఉన్న ప్రజలకు తుఫాన్ ప్రభావం పై అవగాహన కల్పించి ఎక్కడ ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకున్నారు.

## భారీ వర్షం నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు
- రేపు శ్రీ వారి మెట్టు నడక మార్గం మూత
- టీటీడీ ఈఓ జె.శ్యామలరావు

**తిరుమల, అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)** భారీ వర్షాల కారణంగా వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తిరుమలకు వెళ్లే శ్రీవారి మెట్టు నడక మార్గాన్ని రేపటి వరకు మూసివేయాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో టీటీడీ ఈఓ జె.శ్యామలరావు బుధవారం టీటీడీ ఉన్నతాధికారులతో వర్చువల్ గా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విపత్తుల నిర్వహణ ప్రణాళికపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భారీ వర్షాల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కొండ చరియలపై ప్రత్యేక నిఘా ఉంచి ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ కు అంతరాయం కలకగకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ శాఖ ముందస్తు జాగ్రత్తగా జనరేటర్ల కొరకు డీజిల్ ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఐటీ వింగ్ భక్తుల దర్శనాలు, వసతి, ప్రసాదం వంటి కార్యాకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయం చూసుకోవాలన్నారు. వైద్య శాఖ అంబులెన్సు లను అందుబాటులో పెట్టుకుని సిబ్బందితో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంజనీరింగ్ విభాగం డ్యామ్ గేట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఘాట్ రోడ్లలో జేసీబీలను సిద్ధంగా ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు ఇంజినీరింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైతే అగ్ని మాపక సిబ్బంది వేగంగా స్పందించేందుకు అన్నీ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజా సంబంధాల విభాగం వాతావరణ సమాచారాన్ని తెలుసుకుంటూ ఎస్వీబీసీ, సోషియల్ మీడియా ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ భక్తులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఇప్పటికే పాపవినాశనం, శిలా తోరణం మార్గాలను టీటీడీ మూసివేసింది. వాతావరణ పరిస్థితులను బట్టి ఈ మార్గాల్లో రాకపోకలను టీటీడీ పునరుద్ధరించనుంది. ఈ సమావేశంలో టీటీడీ అడిషనల్ ఈఓ సి. హెచ్.వెంకయ్య చౌదరి, టీటీడీ జేఈఓ. గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సిఈ సత్య నారాయణ ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ప్రగతి కోసమే పల్లె పండుగ

- శంకుస్థాపన చేసిన పనులన్నింటినీ సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు కృషి
- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ అక్టోబర్ 16 (వార్త ప్రభ):–** పల్లెలకు పూర్వవైభవం తెచ్చేందుకే పల్లె పండుగ పేరుతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని స్థానిక శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య తెలిపారు. బుధవారం మండలంలోని కమ్మవారిపాలెం, రాఘవాపురం,పల్లగిరి గ్రామాలలో పలు సీసీ రోడ్ల పనులకు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి అధికారులు మరియు కూటమి నేతలతో కలసి సౌమ్య భూమి పూజ చేశారు. అనంతరం తంగిరాల సౌమ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన వందరోజుల్లోనే పెద్ద ఎత్తున గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు.ఒక పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిందన్నారు.మండలంలో 5 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ప్రకటించారు.సుమారు రూ.60లక్షలతో కమ్మవారిపాలెం, రాఘవాపురం, పల్లగిరి గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు.పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో తాగు నీరు, విద్యుత, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. శంకుస్థాపన చేసిన పనులన్నింటినీ సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు.రాబో యే రోజుల్లో ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామన్నారు.

## గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోండి

### జాకీర్ హుస్సేన్ కాలేజీ లో అవగాహన



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 16(వార్తా ప్రభ ప్రతినిధి):–** ఉమ్మడి కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి 2025లో జరగనున్నాయని దీనికి డిగ్రీ, బిటెక్,డిప్లొమా పూర్తయి 3 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు అర్హులని నూతనంగా ఓట్లు నమోదు చేసుకోవాలని ఇబ్రహీంపట్నం డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాలలో అవగాహన కల్పించారు. ఆన్లైన్ కానీ అప్లికేషన్ ను స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో నవంబర్ 6 లోపు అందజేయాలని తెలిపారు. ప్రతిఒక్క పట్టభద్రులు తమ ఒరిజినల్ డిగ్రీ ప్రొవిజినల్,పాస్ పోర్ట్ సైజ్ ఫోటో,ఓటర్ ఐడి,ఆధార్ కార్డు తప్పనిసరి గా ఆఫ్లైన్ అప్లికేషన్లో గెజిటెడ్ సైన్ చేయించుకోవాలని తెలిపారు. ఆఫీసు అడ్రస్ యుటిఎఫ్ సిఐటియు ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం కామ్రేడ్ వెలగా లక్ష్మణరావు భవన్ నందు ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8:30 వరకు ఓట్ల నమోదు ప్రక్రియ చేస్తున్నామని ఈ అవకాశాన్ని గ్రాడ్యుయేట్స్ డిగ్రీ బీటెక్ పాలిటెక్నిక్ పూర్తయిన మూడు సంవత్సరాలు దాటిన వారు అర్హులని వారందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫోరం తరపున ప్రస్తుత ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పనిచేస్తున్నారని హక్కులకై శాసనమండలిలో తమ గళం వినిపించారని అలాంటి ఉద్యమ అభ్యర్థులను రాబోయే రోజుల్లో గెలిపించుకోవాలని గ్రాడ్యుయేట్స్ కు సిఐటియు నేత మహేష్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సాదిక్ , లెక్చరర్స్ బేగ్ , రవీంద్ర, నాగరాజు,రవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ అంతర్గత రోడ్ల నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు.

**కలిదిండి అక్టోబర్ 16 (వార్తా ప్రభ)** గ్రామీణ అంతర్గత రోడ్ల నిర్మాణమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. కైకలూరు నియోజకవర్గం, కలిదిండి మండలం, మట్టగుంట గ్రామంలో "పల్లె పండగ పంచాయతీ "వారోత్సవాలలో భాగంగా 15.44 లక్షల మహాత్మా గాంధీ జాతియ ఉపాధి హామీ నిధుల నుండి మంజూరైన మూడు సిసి రోడ్లను అధికారులు నాయకులు తో కలిసి శంకుస్థాపన చేశారు.అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా 4500 కోట్లతో గ్రామీణ ప్రాంతాలలో రోడ్లను నిర్మాణం చేపట్టబోతున్నారని తెలిపారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ పట్టన్నున్నదని తెలిపారుని ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నాగిడి వీరబ్రహ్మం,అంద్రాజు దుర్గారావు, తిరుమా ని పాండురంగారావు, ఒడుగు గణపతి,నల్లమోతి వెంకటేశ్వరరావు,తిరుమాని గోపాలకృష్ణ ,తిరుమల శెట్టి వెంకటేశ్వరరావు,కోకా తాతయ్య దున్న సత్యనారాయణ,రాజనాల రవి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, ఉపాధి హామీ ఏపీవో ఆనంద్,పంచాయతీ కార్యదర్శి శేఖర్,విఆర్వో డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షాలకు ప్రజలను అప్రమత్తం చేసిన సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్



**సంగం, అక్టోబర్ 16 (వార్తప్రభ):** శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలంలో పెన్నా బ్యారేజి, పలు కాలువల వద్దకు వెళ్లకుండా గట్టి చర్యలు చేపట్టిన సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్. సందర్భంగా సీఐ వేమారెడ్డి మాట్లాడుతూ వర్షాల తీవ్రత అధికంగా ఉండటం వలన ప్రజలు ఎవరూ నదులు, కాలువల వద్దకు వెళ్ళకూడదు అని ఆయన తెలిపారు . తుఫాన్ ప్రభావం తగ్గేవరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్షాల నేపథ్యం లో గ్రామాల్లో ఎటువంటి ఇబ్బందులున్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు ఉచిత మినుము విత్తనాలు పంపిణీ



**పొదలకూరు అక్టోబర్ 16 (వార్తాప్రభ)** మండలంలోని కనుపర్తి సచివాలయంలో గురువారం నాడు రైతులకు ఉచిత మినుము విత్తనాలను పంపిణీ చేశారు కొత్తరకం వంగడం వీబీఎన్ –8 రకం విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందజేస్తున్నారు. మినుము లో వచ్చే తెల్ల దోమ పేరు బంక తెగులను తట్టుకోవడా నికి వీబీఎన్–8 రకం విత్తనాలకు ఉందని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తెలియజేస్తున్నారు. కనుపర్తి సచివాలయ పరిధిలో రైతులకు నాలుగు కేజీల మినుము విత్తనాల కలిగిన బ్యాగులను సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ రత్నమ్మ రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలమర్తి ప్రభాకర్ రెడ్డి ఆల్తుర్తి ఉపసర్పంచ్ ఖాదర్ భాషా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చెనికల వారి వివాహా వేడుకల్లో పాల్గొన్న దారపనేని



**కనిగిరి అక్టోబర్ 16 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య సోదరుడు చెనికల మాధవరావు సతీమణి జయమ్మ దంపతుల జేష్ట పుత్రిక చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి అన్నపూర్ణ, ఒంగోలు వాస్తవ్యులు మోదుబోయిన లక్ష్మీనారాయణ సతీమణి ప్రభావతి దంపతుల కుమారుడు చిరంజీవి మనోజ్ కుమార్ ల వివాహ వేడుకలు బుధవారము అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో చెనికల, మానం, నూతలపాటి కుటుంబ సభ్యుల ఆప్తమిత్రులు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ వధువు అన్నపూర్ణను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీలు చెనికల పెదమాల కొండయ్య, చెనికల వెంగమ్మ, బంధుమిత్రులు గద్దగూటి వేమయ్య అండ్ బ్రదర్స్, నూతల పాటి వెంకటేశ్వర్లు అండ్ బ్రదర్స్, నూతంగి నరసింహారావు అండ్ బ్రదర్స్ , మిరియం గురువయ్య,చెనికల చిన్న మాల కొండయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసులు,డబ్బు కొట్టు కృష్ణ, తోడందుల వెంకటేశ్వర్లు,బొడ్డు వెంకటేశ్వరరావు అండ్ బ్రదర్స్, గడుపూటీ వెంకటేశ్వరరావు, తిరుపతయ్య, మానం మల్లికార్జునరావు అండ్ బ్రదర్స్, చెనికల వారి కుటుంబ సభ్యులు, మానం వారి కుటుంబ సభ్యులు, నూతలపాటి వారి కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పామూరు సిఐ భీమా నాయక్

**కనిగిరి అక్టోబర్ 16 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పామూరు మండలం, వెలిగండ్ల, సి ఎస్ పురం మండలాల్లో చెరువులు, కుంటల లోకి వర్షపు నీరు భారీగా చేరుతుందని పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ఇంటి వద్ద ఉంటున్న పిల్లల్ని చెరువులు, కుంటల వైపు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని, పాడుబడిన ఇళ్ల గోడల వద్ద ఉండరాదని, విద్యుత్ స్తంభాలు వైర్లను తాకరాదని పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్ సూచించారు.



# పొంగిపొర్లుతున్న గొల్లపల్లి పందలవాగు నల్లవాగు

- ప్రజలను అప్రమత్తం చేసిన పోలీసు రెవెన్యూ అధికారులు
- పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఆత్మకూరు ఆర్డీవో పావని





**చేజర్ల అక్టోబర్ 16 (వార్తాప్రభ)** తుఫాను ప్రభావం వలన మండలంలోని గొల్లపల్లి పందల వాగు చేజర్ల తూర్పు ఖంభంపాడు ప్రధాన రహదారి మధ్యలో ఉన్న నల్లవాగు రెండు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండ దంతో మండల అధికారులు అప్రమత్తమయ్యారు.వెంటనే నల్లవాగును పందల వాగును గురువారం తెల్లవారుజాము నుండి పర్యవేక్షించి రాకపోకలను నిషేధించారు.ప్రజలు ఎవరూ కూడా వాగులు దాటి రాకూడదని వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లో ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లవాగు మరియు పందల గుండా ప్రయాణాలు చేయకూడద ని హెచ్చరికలు జారీ చేశారు.భారీ తుఫాను ప్రభావం తగ్గేంతవరకు వాహనదారులు చాలా అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.గొల్లపల్లి పందల వాగు నల్లవాగులను ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ చేజర్ల మండల ఎస్సై ఎన్ ప్రభాకర్ మండల ఇన్చార్జి తహశీల్దారు ఆర్ మస్తానయ్య దగ్గరుండి పరిశీలన చేసి ప్రజలను అప్రమత్తం చేశారు.వాగులు పొంగి పొర్లుతున్న నేపథ్యంలో వాగుల దగ్గర అటు పోలీసు శాఖ ఇటు రెవెన్యూ శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మండలంలోని టీకే పాడు పునరావాస కేంద్రంను ఆత్మకూరు ఆర్డీవో బి.పావని సందర్శించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు వారికి అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.లోతట్టు ప్రాంతమైన చలపనాయుడు పల్లి గ్రామ ప్రజలతో ఆమె మాట్లాడుతూ వర్షం తీవ్రతరం అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఈ ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు.

# షర్మిళ రాజకీయం షురూ...



**కడప, అక్టోబర్ 16 (వార్తాప్రభ)** : వైయస్ షర్మిళ అంటే తెలియని వారుండరు. నేటి రాజకీయాల్లో ఈమె మాట ఎప్పుడూ వినిపిస్తూనే ఉంది. ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న వైయస్ షర్మిళ .. తన రాజకీయ భవిష్యత్ కోసం వడివడిగా అడుగులు వేస్తున్నారనే చెప్పవచ్చు. అయితే పొలిటికల్ ఫ్యామిలీ నుండి వచ్చినా షర్మిళ గురి.. ఏకంగా సీఎం సీటు అయినప్పటికీ ఆ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఇంకా సమయం ఉంది. అప్పటిలోగా తాను బలాన్ని పెంచుకోవాలని, ఏపీలో నెంబర్-2 పార్టీగా కాంగ్రెస్ ఉండాలన్న భావనతో షర్మిళ ముందడుగు వేస్తున్నా.. అది ఫలించేనా లేదా అన్నది ఎన్నికల సమయంలో పరిస్థితులను బట్టి చెప్పవచ్చని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.ఏపీలో కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేతబట్టిన షర్మిళ.. దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ కుమార్తెగా రాష్ట్ర ప్రజలందరికీ సుపరిచితమే. తన అన్న వైయస్ జగన్ వైసీపీని ఏర్పాటు చేసిన సమయంలో షర్మిళ బ్యాక్ బోన్ అని చెప్పవచ్చు. జగన్ అరెస్ట్ సమయంలో.. నేనున్నా అంటూ రాష్ట్ర పాదయాత్ర నిర్వహించారు ఆమె. ఆ సమయంలో వైసీపీ నెంబర్-2 నేత షర్మిళ అనుకున్నారు అంతా. కానీ పార్టీ అధికారంలోకి రాగానే ఆమె సైడ్ అయ్యారు అలాగే సైలెంట్ అయ్యారు.పొలిటికల్ గా రాణించాలని, ప్రజాసేవలో ఉండాలనే భావన ఉన్న షర్మిళ.. అనూహ్యంగా తెలంగాణలో కొత్త పార్టీ స్థాపించారు. మారిన రాజకీయ పరిణామాలతో ఆమె కాంగ్రెస్ వైపుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడే కాంగ్రెస్ వేసిన వ్యూహం ఫలించిందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఏపీలో అధికారంలో ఉన్న జగన్, ఎదురుతిరిగి పార్టీ ఏర్పాటు చేసుకోగా.. అన్నకు పోటీగా చెల్లెలిని రంగంలోకి దింపింది కాంగ్రెస్ అధిష్టానం. ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ అద్యక్షురాలిగా ప్రకటించి.. ఆల్ పొలిటికల్ పార్టీస్ కి షాకిచ్చిందని చెప్పవచ్చు.ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో అన్ని నియోజకవర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులను నిలబెట్టడంలో షర్మిళ విజయవంతమయ్యారు. కడప ఎంపీగా బరిలో నిలిచిన షర్మిళ దురదృష్టవశాత్తు ఓటమి చవిచూసినా.. గట్టిపోటీ ఇచ్చారని చెప్పవచ్చు. నెక్స్ట్ ఎలక్షన్స్ సమయానికి తనదైన శైలిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసుకొని.. తన బలం నిరూపించుకొనేందుకు షర్మిళ ఇప్పటి నుండే పావులు కదుపుతున్నారని పొలిటికల్ టాక్.11 స్థానాలకు పరిమితమైన వైసీపీ.. ప్రజల్లోకి వెళ్లేందుకు ఇప్పటి నుండే గ్రామాల బాట పట్టే అవకాశం ఉంది. దీనికి కారణం పార్టీ వలసల నివారణే అన్నది పొలిటికల్ విశ్లేషకుల అంచనా. వైసీపీ నుండి కాంగ్రెస్ లోకి వలసలు అంత ఈజీ కానప్పటికీ.. చాలా వరకు వైసీపీ నేతలు కాంగ్రెస్ వైపుకు చూస్తున్నారని, కానీ ఎన్నికలకు రెండేళ్లు ముందు పార్టీ తీర్థం పుచ్చుకొనే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులే తెలుపుతున్నారు. అయితే ఇటీవల కూటమి, వైసీపీపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్న షర్మిళ.. సైలెంట్ గా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్ బలం పెంచుకొనే పనిలో ఉన్నారట. ఎలాగైనా నెక్స్ట్ ఎన్నికల సమయానికి తాను అనుకున్న టార్గెట్ చేరుకోవాలని భావిస్తున్న షర్మిళ.. కోరిక నెరవేరుతుందా.. లేదా వేచి చూడాలి. అప్పటిలోగా రాజకీయ ముఖచిత్రంలో ఎన్ని మార్పులు జరుగుతాయో కదా..

# ఎమ్మెల్యే కామినేని ఆధ్వర్యంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు

**వరాహపట్నం, సీతనపల్లి, దొడ్డిపట్ల, రామవరం గ్రామాల్లో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన.**



**: కైకలూరు అక్టోబర్ 16 (వార్తా ప్రభ)** ఏలూరుజిల్లా, కైకలూరు నియోజకవర్గం, కైకలూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన



ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వరాహపట్నం, సీతనపల్లి ,దొడ్డిపట్ల, రామవరం గ్రామాల్లో పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు సందర్భంగా కైకలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అధికారులు మరియు కూటమి నాయకులతో కలిసి సిమెంట్ రోడ్ల నిర్మాణానికు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఆయా గ్రామాల, సర్పంచులు మరియు ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల ఘాట్‌రోడ్డులో విరిగిపడిన కొండచరియలు

**రేణిగుంట రన్‌వేపైకి భారీగా వరద నీరు**
**తిరుమలకు వెళ్లే ఘాట్‌రోడ్డులో విరిగిపడ్డ కొండచరియలులి ట్రాఫిక్? కాకుండా ముందస్తు చర్యలు చేపట్టిన టీటీడీ లిలిభారీ వర్షాలతో రేణిగుంట రన్‌వేపైకి చేరిన నీరు-హైదరాబాద్ నుంచి రేణిగుంటకు వస్తున్న విమానం చెన్నైకు దారిమళ్లింపు**

**తిరుపతి, అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)** భారీ వర్షాల కారణంగా తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో స్వల్పంగా బండరాళ్లు రోడ్డుపై పడ్డాయి. దీంతో సిబ్బంది జేసీబీల ద్వారా వాటిని తొలగిస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా టీటీడీ ముందుస్తు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో భక్తలను శ్రీవారి పాదాలు, ఆకాశ గంగ, జాపాలి, పాపవినాశనానికి టీటీడీ అనుమతించడం లేదు. ఇప్పటికే తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలను కూడా రద్దు చేశారు. వర్షాల కారణంగా భక్తుల భద్రత మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు హైదరాబాద్ నుంచి రేణిగుంటకు వస్తున్న విమానాన్ని చెన్నైకు దారి మళ్లించారు. భారీ వర్షాలతో తిరుపతి జిల్లాలో రేణిగుంట రన్‌వేపైకి భారీగా వరద నీరు చేరింది. దీంతో ల్యాండింగ్ సమస్య తలెత్తడంతో ఇండిగో విమానాన్ని చెన్నైకు దారి మళ్లించారు. భారీ వర్షంతో రేణిగుంట సమీపంలోని భగత్‌సింగ్ కాలనీ, జ్యోతిరావు ఫులే కాలనీలోకి వరద చేరింది. రేణిగుంట-మామండూరు మార్గంలో భారీ వృక్షం కూలింది. దీంతో ట్రాఫిక్? స్తంభించిపోయింది. రేణిగుంట మండలం ఎల్లమంద్యంలోని లోతట్టు ప్రాంతాల్లో కూడా భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో ఎల్లమంద్యంలోని ఉన్న 15 కుటుంబాలను అధికారులు ఎంపీపీ పాఠశాలకు తరలించారు. తిరుపతి అర్బన్ పరిధిలో 17 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**అందుబాటులో ఎస్డీఆర్ఎఫ్ బృందాలు :**

తిరుమల గిరుల్లో భారీ వర్షాలతో మాల్వాడిగుండం భారీగా ప్రవహిస్తోంది. కొండల నుంచి వస్తున్న నీరు తిరుపతి కాలనీల్లోకి వచ్చి చేరుతోంది. ఆటోనగర్ కాలనీ, రాజీవ్‌గాంధీ కాలనీ, కొరమీనుగుంటలో వరద వస్తోంది. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం గుడిమల్లం వద్ద సీత కాల్వ కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తోంది. ఏపీలోని భారీ వర్షాల కారణంగా జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. గూడూరు సబ్ కలెక్టరేట్‌లో ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచారు. సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లోని తీరప్రాంతాల్లో కోట, వాకాడు, తడ, సూళ్లూరుపేట, చిల్లకూరులో వర్షం కురుస్తోంది. ఇప్పటికే ఏపీలో బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం ఏర్పడింది. దీంతో మూడు రోజులపాటు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున తిరుమల తిరుపతి దేవస్థానం, టీటీడీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం సిబ్బందితో సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. ఇందులో భాగంగా ఇవాళ వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తెలిపింది.

## లోతట్టు ప్రాంతాల ప్రజలకు సూచనలు



**గుత్తి: అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**భారీ వర్షాల ప్రభావంతో గుత్తిలోని లోతట్టు ప్రాంతాలు, కొండ చరియాలు, శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివసిస్తున్న ప్రజలకు మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా బుధవారం పలు సూచనలు చేశారు. అనంతరం లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని పాత మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలకు తరలించారు.

## వరద సాయం అందించి ఆదుకోండి

**తహసిల్దార్ కు మూలపాడు బీసీ కాలనీ వాసుల వినతి పత్రం**



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 16(వార్తా ప్రభ ప్రతినిధి):-** మండల పరిధిలోని మూలపాడు గ్రామంలో ఇటీవల సంబంధించిన వరదలకు బీసీ కాలనీ పూర్తిగా ముంపుకు పోయింది. అక్కడ నివాసం ఉంటున్న వారు సర్వం కోల్పోయిన ప్రభుత్వం అందించే అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ బుధవారం నాడు స్థానిక తాసిల్దార్ ప్రభుత్వ అధికారులు వెంకటేశ్వర్లకు వినతి పత్రం సమర్పించారు.వరదల సమయంలో అర్ధరాత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూలపాడు బీసీ కాలనీ ప్రాంతంలో పర్యటించి బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో చాలావరకు వరద సహాయం అందిన ఇంకా బాధిత కుటుంబాలకు సర్వం సాయం అందలేదు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గరికపాటి శివ, గంజి చిరంజీవి, వరద బాధిత మహిళలు పాల్గొన్నారు

## ఎల్లుండి ఇబ్రహీంపట్నం మండలంలో పల్లె పండుగ

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16 (వార్తా ప్రభ ప్రతినిధి):-** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని దాములూరు, చిలుకూరు, కాచవరం, కేతనకొండ, ఈలప్రోలు గ్రామాల్లో ఈ నెల 19న పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సునీత శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో రూ.22.84 లక్షలతో 25 రహదారులు, అభివృద్ధి పనులకు మైలవరం శాసన సభ్యుడు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ భూమి పూజ చేసి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## కోదండ రామాలయం పునః ప్రతిష్ట లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డిఎన్ఆర్.



**కైకలూరు అక్టోబర్ 16 (వార్తా ప్రభ)** వైస్సార్సీపీ ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షులు, కైకలూరు మాజీ శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు ఈ రోజు మధ్యాహ్నం కైకలూరు మండలం తామరకొల్లు లో శ్రీ కోదండ రామాలయం పునః ప్రతిష్ట మరియు అన్న సమారాధన సందర్భంగా జరిగిన అఖండ అన్న సమారాధన కార్యక్రమం పాల్గొని స్వామి వారిని దర్శించి చల్లని తండ్రి రామయ్య యొక్క ఆశీస్సులు ప్రతి ఒక్కరికి కలగాలని స్వామి వారికి నమస్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మరియు సర్పంచ్ బట్రాజ్ శివాజీ, వైస్సార్సీపీ సీనియర్ నాయకులు బోడావుల అప్పయ్య, మీగడ బాబీ, బుర్ల వెంకన్న, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మరో వివాదంలో కోనేటి



**తిరుపతి, అక్టోబర్ 16 (వార్తా ప్రభ)** సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు కాలం కలిసి రాలేదా? ఏదో విధంగా ఆయనను వివాదాలు చుట్టు ముట్టుతున్నాయా? మళ్లీ వార్తల్లోకి రావడానికి కారణమేంటి? తాజాగా ఆడియో టేప్‌లు ఏం చెబుతున్నాయి? దీనిపై మళ్లీ చర్చించుకోవడం ప్రజల వంతైంది.లేటెస్ట్‌గా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.. ఓ మహిళతో మాట్లాడిన ఆడియో టేప్ వెలుగులోకి వచ్చింది. నువ్వు చాలా అందంగా ఉన్నావు.. పర్సనాలిటీ చాలా బావుందని వ్యాఖ్యానించారు సదరు ఎమ్మెల్యే. ఈ ఆడియో సోషల్ మీడియా లో వైరల్ అవుతోంది.నెల రోజుల కిందట ఎమ్మెల్యే ఆదిమూలం తనపై అత్యాచారం చేశాడంటూ ఓ మహిళ ముందుకొచ్చింది. అంతేకాదు ఏకంగా వీడియోలు విడుదలు చేసింది. ఆ వివాదం ముగియకముందే మరో ఆడియోతో వెలుగులోకి వచ్చారు ఎమ్మెల్యే ఆదిమూలం.సత్యవేడుకు చెందిన టీడీపీకి చెందిన ఓ మహిళా కార్యకర్తను ఎమ్మెల్యే ఆదిమూలం లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో ఆయనను టీడీపీ హైకమాండ్ సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారంలో బాధిత మహిళను న్యాయస్థానం ముందు హాజరై స్వయంగా వివరణ ఇచ్చుకుంది. ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించిన అంశాలన్నీ అవాస్తమని పేర్కొంది. కొద్ది రోజుల కిందట సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనను వేధిస్తున్నారంటూ టిడిపికి చెందిన ఓ మహిళ నేత ఆరోపించారు. అంతటితో ఆగకుండా తిరుపతిలోని ఓ లాడ్జిలో ఎమ్మెల్యే తనపై లైంగిక దాడి చేశారంటూ సీక్రెట్ కెమెరాతో తీసిన ఫోటోలు, వీడియోను బయటపెట్టారు. ఏకంగా టిడిపి అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన హై కమాండ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పై సస్పెన్షన్ వేటు వేసింది. అదే సమయంలో బాధిత మహిళ నేత ఫిర్యాదు మేరకు కేసు నమోదయింది. కోర్టులోకి చేరింది ఈ అంశంఅయితే ఈ కేసు విషయంలో రాజీ పడ్డారు బాధిత మహిళ. తనపై ఎమ్మెల్యే ఆదిమూలం ఎటువంటి వేధింపులకు పాల్పడలేదంటూ ఆమె తరుపు న్యాయవాది లిఖితపూర్వకంగా కోర్టులో తెలియజేశారు. దీంతో కేసు రాజీకి మార్గం ఏర్పడింది. అయితే ఇంతలో అదే ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గొంతుతో కూడిన ఆడియో హల్ చల్ చేస్తోంది. తెగ వైరల్ అవుతోంది.

## తాతయ్య ప్రబోధ మాలిక



నమ్మితే వమ్ము చేయకు
నిజమెరుగక నింద వేయకు
బహు సున్నితం హృదయాలు
ఎప్పుడు గాయాలు రేపకు
ఎవరిపై దోషం మోపకు
నిర్లక్ష్యంగా చూడకు
మనషులంతా ఒక్కటే!!
భేదభావాన్ని చూపకు
ఎవరి నాశనము కోరకు
అపజయాలకు క్రుంగకు
విజయాన్ని పొందేవరకు
ఏమాత్రం విశ్రమించకు
నిరాశతో జీవించకు
గురి లేక పయనించకు
ఆశయాల సాధనలో
నువ్వు వెనుకడుగు వేయకు

**-గద్వాల సోమన్న,**
9966414580

# సీఐడి చేతికి హై ప్రొఫైల్ కేసులు

**గుంటూరు, అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్‌లో సీఐడీ మరో సారి యాక్టివ్ అవుతోంది. వైఎస్ఆర్‌సీపీ హయాంలో సీఐడీ సోషల్ మీడియా కేసుల నుంచి ప్రభుత్వ పెద్దలకు అత్యంత ముఖ్యమైన మార్గదర్శి వంటి కేసుల వరకు అన్నింటినీ డీల్ చేసేది. దాదాపుగా అన్ని రాజకీయ పరమైన కేసులే. ఇతర కేసుల విచారణ సాధారణ పోలీసులు తీసుకునే వారు. ఈ కారణంగా అప్పటి సీఐడీ చీఫ్‌లుగా పని చేసిన పీవీ సునీల్ కుమార్ తో పాటు సంజయ్ కు పోస్టింగ్‌లు లేవు. ఇద్దరిపై కేసులు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం మారిన తర్వాత కూడా అలంటి హై ప్రొఫైల్ కేసులు సీఐడీ వద్దకే వెళ్తున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ ఆఫీసుతో పాటు చంద్రబాబు ఇంటిపైనా దాడి జరిగింది. ఆ కేసులను అప్పట్లో పోలీసులు పట్టించుకోలేదు. కానీ ప్రభుత్వం మారిన తర్వాత దాడి జరిగింది తనపై కాబట్టి టీడీపీ నేతలు సీరియస్ గా తీసుకున్నారు. సీసీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆదారాలతో అరెస్టులు ప్రారంభించారు. చంద్రబాబు ఇంటిపైకి జోగి రమేష్ దాడికి వెళ్లిన కేసు కూడా వేగం పుంజుకుంది. తాజాగా హీరోయిన్ జత్వానీ కేసును కూడా సీఐడీకి అప్పగించారు.గత ప్రభుత్వ హయాంలో మద్యం , ఇసుకల పై భారీ స్కాం జరిగిందని ప్రస్తుత ప్రభుత్వం వెల్లడించింది. సీఐడీ ఈ మేరకు కేసులు పెట్టింది. మైనింగ్ వ్యవహారాలను తన చేతుల మీదుగా నడిపిన వీజీ వెంకటరెడ్డి అనే అధికారిని ?రెస్టు చేశారు. తదుపరి చర్యలు తీసుకోనున్నారు. లిక్కర్ స్కాంలో కీలకమని భావిస్తున్న మరో అధికారి వాసుదేవరెడ్డి పరారీలో ఉన్నారు. లిక్కర్ స్కామును ఇప్పటికే సీఐడీకి అప్పగిస్తున్నట్లుగా చంద్రబాబు ప్రకటించారు . ఇందులో పెద్ద ఎత్తున నగదు అక్రమ చెలామణి జరిగిందని అందుకే ఈడీకి కూడా సిపారసు చేస్తామని చంద్రబాబు తెలిపారు.

# ఏపీకి వరదల ముప్పు...

**విశాఖపట్టణం, అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)** : బంగాళాఖాతంలో అక్టోబర్ ? నవంబర్ మధ్యకాలంలో తుఫాన్లు ఏర్పడుతుంటాయి. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వర్షాల ముప్పు పొంచి ఉంటుంది. సాధారణంగా ప్రతి ఏడాది అక్టోబర్ నెలలో నైరుతి రుతుపవనాలు నిస్తేజంగా మారతాయి. ఆ తర్వాత ఈశాన్య రుతుపవనాలు ఎంట్రీ ఇస్తాయి. ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించే కాలంలో సముద్ర ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. ఇవి బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడేందుకు అనుకూలంగా ఉంటాయి. అవిక్రమంగా వాయుగుండాలుగా రూపాంతరం చెందుతాయి. అప్పుడప్పుడు పెను తుఫాన్లుగా మారతాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. అది తీవ్ర వాయుగుండం గా మారి.. ఆ తర్వాత తుఫాన్ గా రూపాంతరం చెంది అవకాశముందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గత పది సంవత్సరాల కాలంలో అక్టోబర్ ? డిసెంబర్ మధ్యకాలంలో 11 తుఫాన్లు చోటుచేసుకున్నాయి. అందులో ఆరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తీరం దాటడం విశేషం.బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కాస్త అల్పపీడనంగా మారింది. అది నెలకొన్న చెన్నై తీరం వరకు బంగాళాఖాతం ఉపరితల ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. ఈ ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే అరేబియా సముద్రంలో అల్పపీడనం తీవ్ర రూపు దాల్చింది. ఇది తీవ్రవాయుగుండం గా మారుతోందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అది అక్కడి నుంచి బంగాళాఖాతంలో ఉన్న అల్ప పీడనం వరకు ఆవరించి ఉందని తెలుస్తోంది. గత సెప్టెంబర్ నెలలో ఇదే తీరుగా బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. అదే సమయంలో అరేబియా సముద్రం పై తుఫాన్ ఆవరించి ఉంది.. అప్పుడు రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి..ఫలితంగా ఏపీలోని విజయ వాడలో విపరీతంగా వర్షాలు కురిసాయి. ఈసారి కూడా అదే స్థాయిలో భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.2014 సంవత్సరంలో హుద్ హుద్ తుఫాన్ ఏర్పడింది.. ఆ తుఫాన్ వల్ల విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి..ఆ తుఫాన్ విశాఖపట్నంలో తీరం దాటింది.2016 లో డిసెంబర్ నెలలో వార్దా తుఫాన్ కాకవికలం సృష్టించింది. తుఫాన్ వల్ల నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, కడప జిల్లాలో తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. వార్ధా తుఫాను నెల్లూరులో తీరం దాటింది.2018 అక్టోబర్ నెలలో తిత్లీ తుఫాన్ ఏర్పడింది.. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు ఈ తుఫాన్ వల్ల నష్టపోయాయి.. శ్రీకాకుళంలో ఈ తుఫాన్ తీరం దాటింది.2018 డిసెంబర్లో పెతాయ్ తుఫాన్ ఏర్పడింది. కృష్ణా, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో తీవ్రంగా నష్టపోయాయి.. ఈ తుఫాన్ కాకినాడ సమిపంలో తీరం దాటింది.2021 సెప్టెంబర్ నెలలో గులాబ్ తుఫాన్ ఏర్పడింది. కళింగపట్నం వద్ద తీరం దాటింది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఈ తుఫాన్ వల్ల నష్టపోయాయి.2022 డిసెంబర్ నెలలో మాండౌస్ తుఫాన్ ఏర్పడింది. మహాబలిపురం వద్ద తీరం దాటింది. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాలో తీవ్రంగా ప్రభావితమయ్యాయి.2023 డిసెంబర్ నెలలో మిచౌంగ్ తుఫాన్ ఏర్పడింది. బాపట్లలో తీరం దాటింది.. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి.

# మృణాల్.. తప్పుకోవడమే బెటర్



తెలుగు, హిందీ భాషలలో సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్ గా తనదైన బ్రాండ్ తో దూసుకుపోతున్న అందాల భామ మృణాల్ ఠాకూర్. 'సీతారామం' సినిమాతో తెలుగునాట మృణాల్ ఠాకూర్ కి విశేషమైన గుర్తింపు లభించింది. దాని తర్వాత 'హాయ్ నాన్న' తో మరో హిట్ అందుకుంది. చివరిగా ఈ ఏడాది విజయ్ దేవరకొండకి జోడీగా 'ది ఫ్యామిలీ స్టార్' మూవీతో మృణాల్ ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. ఇదిలా ఉంటే మృణాల్ ఠాకూర్ హిందీలో 'పూజా మేరీ జాన్' అనే సినిమా చేసింది. హ్యూమా ఖురేషి ఈ సినిమాలో మరో లీడ్ రోల్ లో చేసింది. నవంబర్ లో ఈ సినిమాని రిలీజ్ చేయడానికి ముందుగా ప్లాన్ చేశారు. అయితే ఇప్పుడు 2025కి మూవీని వాయిదా వేసినట్లు టాక్ వినిపిస్తోంది. దీనికి కారణం విక్కీ కౌశల్, రష్మిక జోడీగా నటించిన 'చావా' మూవీ అని తెలుస్తోంది. ఈ సినిమా డిసెంబర్ 6న థియేటర్స్ లోకి రాబోతోంది. భారీ బడ్జెట్ తో హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ మూవీగా ఈ చిత్రం రాబోతోంది. మడ్ డోక్ ఫిలిమ్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మించింది. 'పూజా మేరీ జాన్' సినిమా కూడా అదే బ్యానర్ లో తెరకెక్కింది. ఈ రెండు సినిమాలు బ్యాక్ టూ బ్యాక్ రిలీజ్ చేయాలని ముందు అనుకున్నారు. అయితే 'పూజా మేరీ జాన్ మూవీ' మీద మేకర్స్ ఫుల్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. అలాగే 'చావా' మూవీ పైన భారీ అంచనాలు ఉన్నాయి. ఛత్రపతి శంభాజీ మహారాజ్ బయోపిక్ గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. అలాగే పుష్ప 2 కూడా అదే టైమ్ లో వస్తోంది. అసలే హిందీలో ఈ సినిమాకు మంచి బజ్ ఉంది. థియేటర్స్ కూడా గట్టిగానే రావచ్చు. దీంతో 'పూజా మేరీ జాన్' మూవీతో 'చావా' కి ఇబ్బంది అవుతుందని నిర్మాత భావించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రెండు సినిమాలకి ఇబ్బంది కాకుండా 2025కి మృణాల్ ఠాకూర్ చిత్రాన్ని వాయిదా వేశారంట. ఎలాంటి పోటీ లేకుండా సింగిల్ గా ఆ చిత్రాన్ని రిలీజ్ చేయాలని అనుకుంటున్నారంట. 'చావా' మూవీలో విక్కీ కౌశల్ కి జోడీగా రష్మిక మందన నటిస్తోంది. ఇదిలా ఉంటే దీపావళికి బాలీవుడ్ నుంచి 'సింగం అగైన్' మూవీతో పాటు 'భూల్ భులయ్యా 3' రిలీజ్ అవుతున్నాయి. వీటి తర్వాత డిసెంబర్ 6న 'చావా' థియేటర్స్ లోకి వస్తోంది. క్రిస్మస్ కానుకగా వరుణ్ ధావన్ 'బేబీ జాన్' చిత్రంలో రిలీజ్ కాబోతోంది. ఇలా కాస్తా హైప్ ఉన్న సినిమాలు అన్ని కూడా రెండు నెలల గ్యాప్ లో బ్యాక్ టూ బ్యాక్ బాలీవుడ్ లో విడుదల కాబోతుండటం విశేషం.

# దేవర విజయం.. వారి కోసం ఎన్టీఆర్ థాంక్స్ లెటర్



దేవర 1 – బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. దసరా సెలవులు కూడా ఈ సినిమాకు హెల్ప్ అయ్యాయి. ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద 500 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రావడంతో ఎన్టీఆర్ కెరీర్ లో ఒక బిగ్ రికార్డ్ నమోదైంది. ఇక ఈ సినిమా విజయం పట్ల చిత్ర యూనిట్ కూడా ఎంతో సంతోషంగా ఉంది. జూనియర్ ఎన్టీఆర్ కూడా ఓపెన్ గా ఒక లెటర్ విడుదల చేశారు. అందులో చిత్ర యూనిట్ కి ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతూ, ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కూడా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ ఈ విధంగా వివరణ ఇస్తూ.. "దేవర పార్ట్ 1'కి అందుతున్న అద్భుతమైన స్పందనకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సినిమా ఎప్పటికీ నా హృదయంలో ప్రత్యేక స్థానం కలిగి ఉంటుంది. నా సహ నటులైన సైఫ్ అలీ ఖాన్ సర్, జాన్వీ, ప్రకాష్ రాజ్ గారు, శ్రీకాంత్ గారు మరియు ఇతర నటీనటులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. వారు తమ పాత్రలకు ప్రాణం పోసి, మా కథకు జీవం ఇచ్చారు" అని అన్నారు. "అలాగే నా దర్శకుడు కొరటాల శివ గారికి ధన్యవాదాలు. ఈ కథను సృష్టించిన ఆయన దిశానిర్దేశంతోనే ఈ ప్రాజెక్ట్ విజయవంతమైంది. అనిరుధ్ అద్భుతమైన సంగీతం, రత్నవేలు సర్ సినిమాటోగ్రఫీ, సాబు సర్ ప్రొడక్షన్ డిజైన్, యుగంధర్ గారు వీఎఫ్ఎక్స్, శ్రీకర్ ప్రసాద్ గారు ఎడిటింగ్ తో ఈ చిత్రాన్ని అద్భుతంగా మలిచినందుకు ధన్యవాదాలు. మా సినిమాను విజయవంతంగా ప్రదర్శించిన పంపిణీదారులు మరియు థియేటర్ ప్రదర్శకులకు ధన్యవాదాలు" అని తారక్ తెలిపారు "ఇక నా సినీ పరిశ్రమ మిత్రులకు, వారు అందించిన ప్రేమకు ధన్యవాదాలు. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న మీడియాకు మా సినిమాను విశేషంగా ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు. మా నిర్మాతలు సుధాకర్ మిక్కిలినేని గారు మరియు హరికృష్ణ కొసరాజు గారికి ఈ ప్రాజెక్టున్ను విజయవంతంగా రూపొందించినందుకు ధన్యవాదాలు. ప్రపంచ నలుమూలల ఇంతటి ఆదరణ చూపిస్తున్న ప్రేక్షక దేవుళ్లకు నా ధన్యవాదాలు. నా కుటుంబ సభ్యులైన నా అభిమానులందరికీ, గత నెల రోజులుగా దేవర చిత్రాన్ని ఒక పండుగలా జరుపుకుంటున్నందుకు శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. మీరు చూపించే ప్రేమ అభిమానమే నన్ను ఈ స్థాయికి చేర్చింది. మీరు ఎలప్పుడు గర్వపడే చిత్రాలు చేస్తూనే ఉండడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. 'దేవర పార్ట్ 1' చిత్రాన్ని మీ భుజాలపై మోసి, ఇంతటి ఘనవిజయవంతంగా మార్చినందుకు కృతజ్ఞతలు" అంటూ జూనియర్ ఎన్టీఆర్ తన సంతోషాన్ని ఈ విధంగా షేర్ చేసుకున్నారు.

# ఓవియా... మరో లక్కీ ఛాన్స్



తమిళ్ బిగ్ బాస్ సీజన్ 1లో పాల్గొని బాగా పాపులర్ అయిన బ్యూటీ ఓవియా. కేరళకి చెందిన ఈ బ్యూటీ కోలీవుడ్ నటిగా కొనసాగుతోంది. అలాగే మలయాళీ, కన్నడ, తెలుగు భాషలలో కూడా ఓవియా హీరోయిన్ గా చాలా సినిమాలు చేసింది. రెగ్యులర్ గా మూవీస్ చేస్తోన్న కూడా స్టార్ హీరోయిన్ రేంజ్ గుర్తింపు అయితే ఆమెకి లేదు. ఇదిలా ఉంటే బిగ్ బాస్ సీజన్ 1లో బాగా పాపులర్ అయిన ఓవియా మరల ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. కొద్ది రోజుల క్రితం ఓవియా లీక్డ్ వీడియో అంటూ ఒకటి సోషల్ మీడియాలోవైరల్ అయ్యింది. దీనిపై ఆమె కూడా రియాక్ట్ అవుతూ ఎంజాయ్ అంటూ పోస్ట్ చేసింది. ఓవియా డేరింగ్ గా తనపై జరుగుతున్న సోషల్ మీడియా వేధింపులని ఎదుర్కొంది. దీంతో ఆమెకి తమిళనాట సెలబ్రెటీల నుంచి మద్దతు లభిస్తోంది. అలాగే నెటిజన్లు కూడా ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇదిలా ఉంటే ఇలాంటి సమయంలో హీరో లారెన్స్ 'కాంచనా 3' మూవీ సమయంలో ఓవియాతో దిగిన ఫోటోని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేశారు. ఈ ఫోటో కాస్తా ఇప్పుడు వైరల్ అవుతోంది. అలాగే మరో న్యూస్ కూడా తెరపైకి వచ్చింది. రాఘవ లారెన్స్ సూపర్ హిట్ ఫ్రాంచైజ్ 'కాంచనా' సిరీస్ లో 4వ మూవీని త్వరలో సెట్స్ పైకి తీసుకొని వెళ్లబోతున్నాడు. లారెన్స్ స్వీయ దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కనుంది. కాంచన సిరీస్ పై ఉన్న హైప్ నేపథ్యంలో నెక్స్ట్ రాబోయే చిత్రం పైన హైప్ క్రియేట్ అయ్యింది. 'కాంచనా 4' లో కూడా ఓవియాని ఒక హీరోయిన్ గా తీసుకోబోతున్నారని టాక్ వినిపిస్తోంది. ఆల్ మోస్ట్ ఆమెని లారెన్స్ కన్ఫర్మ్ చేశారని అంటున్నారు. అందుకే లారెన్స్ 'కాంచనా 3' మూవీ షూటింగ్ లో ఆమెతో దిగిన ఫోటో షేర్ చేశారనే ప్రచారం నడుస్తోంది. 'కాంచన 4' ఆమె కీలక పాత్రలో చేయబోతోందని అంటున్నారు. అది ఎంత వరకు వాస్తవం అనేదానిపై అధికారికంగా క్లారిటీ రాలేదు. ఇదిలా ఉంటే ఓవియా తెలుగులో కూడా తరుణ్ కి జోడీగా ఇది నా లవ్ స్టోరీ అనే సినిమాలో హీరోయిన్ గా చేసింది. త్వరలో కాంచన 4 మూవీకి సంబంధించి అఫీషియల్ ప్రకటన రాబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే ఓవియా ప్రస్తుతం రెండు తమిళ్ సినిమాలలో నటిస్తోంది. ఆ రెండు షూటింగ్ దశలో ఉన్నాయి. వాటిలో 'సంభవం' అనే సినిమా వచ్చే ఏడాది రిలీజ్ అయ్యే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది.

# 20 సార్లు హత్యాయత్నాలను ఎదుర్కొని.. మహిళా మంత్రిగా బాధ్యతలు చేపట్టి..



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. నేషనల్ కాన్ఫరెన్స్ లీడర్ ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేయగా.. ఆయనతో పాటు ప్రమాణం చేసిన మంత్రుల్లో ఒకే ఒక్క మహిళ ఉన్నారు. ఆమే సకీనా ఈటూ సకీనా.. దక్షిణ కశ్మీర్‌కు చెందిన కుల్గామ్ జిల్లాలోని డీహెజ్ పోరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఆమె పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి గుల్జార్ అహ్మద్ దర్‌పై 17,449 ఓట్ల మెజార్టీతో గెలుపు దక్కించుకున్నారు. ప్రముఖ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె నేషనల్ కాన్ఫరెన్స్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆమె తండ్రి వలీ మోహమ్మద్ ఈటూ.. ఈ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. ఆయన 1994లో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత తండ్రి వారసత్వాన్ని అందుకొని ముందుకు సాగుతోన్న ఆమె సోదరుడిని 2001లో ఉగ్రవాదులు బలిగొన్నారు. అప్పుడు ఆమె వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. తండ్రి, సోదరుడి మరణాలతో వెనకడుగు వేయని ఆమె రాజకీయ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ఆమెపై కూడా 20 సార్లకు పైగా హత్యా యత్నాలు జరిగాయి. వాటన్నింటిని దాటు కొని.. జమ్మూకశ్మీర్ ప్రభుత్వంలో వివిధ హోదాల్లో పనిచేశారు. లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించారు. పర్యాటక శాఖ, విద్యాశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు సామాజిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. 53 ఏళ్ల వయసులో తాజాగా కేబినెట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. జమ్మూకశ్మీర్‌లో ప్రజాదరణ ఉన్న అతి కొద్దిమంది మహిళా నేతల్లో ఈమె ఒకరు. సామాజిక సంక్షేమం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారు. జమ్మూలోని నౌషేరా నుంచి ఎన్నికైన సురిందర్ చౌధరీ ఈ రోజు డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. జమ్మూ ప్రాంతం ప్రజల గళాన్ని వినిపించేందుకు ఆయన్ను ఈ పదవికి ఎంపిక చేసినట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. "ఈ ప్రభుత్వంలో తమకు ప్రాతినిధ్యం వహించేవారు లేరని జమ్మూ ప్రజలు బాధపడాల్సిన పనిలేదు. ఆ ప్రాంతం నుంచి ఉపముఖ్యమంత్రిని ఎంపిక చేశాను. దీంతో ఈ ప్రభుత్వం తమదని స్థానిక ప్రజలు భావిస్తారు" అని సీఎం అన్నారు.

# ఆత్మ పరిశీలన చేసుకోండి

## పాక్ గడ్డపై షెహబాజ్ ప్రభుత్వానికి జైశంకర్ చురకలు





**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లో జరుగుతోన్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో మాట్లాడిన భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ . షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి చురకలు వేశారు. సీమాంతర ఉగ్రవాదం గురించి ప్రస్తావించి విమర్శలు చేశారు. రెండు దేశాల మధ్య సంబంధాలు ఎందుకు దెబ్బతిన్నాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. నమ్మకం, సహకారం, స్నేహం లోపిస్తే పొరుగువారు దూరమవుతారని వ్యాఖ్యానించారు. "సరిహద్దుల్లో తీవ్రవాదం, ఉగ్రవాదం, వేర్పాటువాద కార్యకలాపాలు ఉంటే.. ఆ రెండు దేశాల మధ్య వాణిజ్యం, అనుసంధానం, ప్రజల మధ్య సంబంధాలకు అవకాశం ఉండదు" అని మంత్రి వ్యాఖ్యానించారు. ఎక్కడా కూడా పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. ఈ సమావేశం అనంతరం మంత్రి ఎక్స్ (ట్విటర్) వేదికగా పోస్టు పెట్టారు. "ఇస్లామాబాద్‌లో జరిగిన ఎస్‌సీఓ సదస్సులో మన దేశం ప్రకటనను వినిపించాను. కల్లోల ప్రపంచంలో మనం ఎదుర్కొంటున్న సవాళ్లకు తగినవిధంగా ఎస్‌సీఓ స్పందించాలి" అంటూ పలు అంశాలను ప్రస్తావించారు. 2019లో పూల్వామాలో సీఆర్పీఎఫ్ జవాన్ల కాన్వాయ్‌పై ఉగ్రదాడి జరిగింది. నాడు ఆ ఘటనలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోగా.. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. దీనికి ప్రతీకారంగా భారత వాయుసేన ఫిబ్రవరి 26న వైమానిక దాడులు చేపట్టింది. పాక్ భూభాగంలోని బాలాకోట్‌లోని జైషే మహ్మద్ ఉగ్ర స్థావరాలపై తెల్లవారు జామున బాంబుల వర్షం కురిపించింది. ఉగ్రవాదాన్ని తాము ఎన్నటికీ సహించబోమని ఈ ఘటనతో భారత్.. పాక్ సహా ప్రపంచదేశాలకు గట్టి సందేశమిచ్చింది. ఇక అప్పటినుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇదిలాఉంటే.. ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేం దుకు వచ్చిన సభ్యదేశాల ప్రతినిధులకు పాక్ ప్రధాని మంగళవారం రాత్రి తన నివాసంలో విందు ఇచ్చారు. ఈసందర్భంగా జైశంకర్, షెహబాజ్‌లు కరచాలనం చేసుకొని కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఎస్సీవో సదస్సులో భారత బృందానికి జైశంకర్ నేతృత్వం వహిస్తారు. తొమ్మిదేళ్ల తర్వాత భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి పాకిస్థాన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. 2015 డిసెంబరులో అప్పటి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ పాకిస్థాన్‌లో పర్యటించారు.

# అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పెరుగుతున్న అనిశ్చితి !




**వాషింగ్టన్** : అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబరు 5న జరగనున్నాయి. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లు పోటీ పడుతున్న ఈ ఎన్నికల్లో పోలింగ్ జరిగే తేదీ దగ్గరపడుతున్న కొద్దీ అనిశ్చితి పెరుగు తోంది. ఎవరు గెలుస్తారనే విషయంలో ఉత్కంఠ నెల కొంటోంది. ట్రంప్ కన్నా హారిస్ ఆధిక్యతను కొనసాగిస్తున్నారని తాజాగా నిర్వహించిన పోల్‌లో వెల్లడైంది. కానీ అనూహ్యమైన రీతిలో తానే గెలుస్తానంటూ తనకు అనుకూలంగా వున్న అంశాలను రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ పేర్కొంటున్నారు. సెప్టెంబరు 29, అక్టోబరు 6 మధ్య జరిగిన న్యూయార్క్ టైమ్స్, సియనా కాలేజ్ పోల్‌లో కమలా హారిస్‌కు 49, ట్రంప్‌కు 46 శాతం ఓట్లు లభించాయి. ఈ పోల్‌లో 3,385మంది ఓటర్లు పాల్గొన్నారు. మార్పును తీసుకువచ్చే అభ్యర్థిగా హారిస్‌ను యువ ఓటర్లు చూస్తున్నారు. యువత వరకు చూసినట్లైతే అభ్యర్థులిద్దరి మధ్య తేడా 58 శాతం, 34శాతంగా వుంది. అదే పురుష ఓటర్లకు సంబంధించి పరిశీలిస్తే ట్రంప్ 11పాయింట్లతో ఆధిక్యతలో వున్నారు. అయితే దేశ ఆర్థిక వ్యవస్థ పట్ల ప్రధానంగా ప్రజల్లో ఆందోళన నెలకొంది. దీన్ని సక్రమంగా చక్కదిద్దగలిగే సమర్థత ట్రంప్‌కే వుందని హారిస్‌కు లేదని ఎక్కువమంది ఓటర్లు భావిస్తున్నట్లు కూడా తెలుస్తోంది. మరోవైపు నమోదైన ఓటర్లలో, ఆఫ్రికన్ వారసత్వం కలిగిన పౌరుల్లో మెజారిటీ ప్రజలు కమలా హారిస్ వైపే మొగ్గు చూపుతున్నారు. అయితే ఆమె కచ్చితంగా మరింత మెరుగైన రీతిలో మార్పు తీసుకువస్తుందని విశ్వసించలేకపోతున్నారని ఎపి–ఎన్ఓఆర్‌సి సెంటర్ ఫర్ పబ్లిక్ అఫైర్స్ రీసెర్చ్ పోల్ వెల్లడించింది. కీలకమైన రాష్ట్రాలు, వూగిసలాట ఎక్కువగా వుండే రాష్ట్రాలు అంతిమంది ఈ పోరును నిర్ణయిస్తాయని భావిస్తున్నారు. చివరి వారాల్లో అభ్యర్థుల కార్యాచరణే ప్రధానంగా కూడా వుండనుంది.

# బాలనగర్ సీఐ కి శుభాకాంక్షలు తెలిపిన బండి రమేష్



**కూకట్ పల్లి,అక్టోబర్16(వార్తప్రభ):** బాలానగర్ సిఐ గా నూతనంగా నియమితులైన నరసింహ రాజు నీ బుధవారం కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ నీ బాలానగర్ పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి రమేష్ పుష్పగుచ్చం అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, గోపిశెట్టి రాఘవేంద్ర, లక్ష్మయ్య, సతీష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి,అజాచ్,తదితరులు పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్ట సిఐ కి శుభాకాంక్షలు తెలిపిన వెంకటయ్య




**కూకట్ పల్లి,అక్టోబర్16(వార్తప్రభ):** జగద్గిరిగుట్ట సీఐగా నూతనంగా నియమితులైన సిఐ కేతూరి నరసింహ ని బుధవారం మేడ్చల్ జిల్లా రజక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెన్నచర్ల వెంకటయ్య, అశోక్ ,ఏ వెంకటయ్య, పరుశు రాం, వివేకానంద కాలనీ ఐలమ్మ రజక సంఘం అధ్యక్షులు రాములు మరి ఇతర సంఘ నాయకులందరూ పాల్గొని సత్కరించారు.

# అడ్మిషన్స్ గడువు అక్టోబర్ 30 వరకు!!

## అర్హులు సదవకాశాన్ని వినియోగించుకోండి
## కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రామచంద్రం



**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)** కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రంలో డిగ్రీ, పీజీ కోర్సులు చేయడానికి అక్టోబర్ 15వ తేదీ వరకు అడ్మిషన్ల గడువు సమయం పెంచినట్లు ప్రకటనలో వివరాలను వెల్లడించారు ఆ కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రామచంద్రం. అర్హులు సదవకాశాన్ని వినియోగించుకోండి అని కోరారు. ఇతర వివరాల కోసం 8341385000 నంబరులో సంప్రదించాలని తెలిపారు. మంచిర్యాల, జైపూర్, ఉట్నూర్, చెన్నూర్, లక్షెట్టిపేట, భూపాలపల్లి, మంథని ప్రాంతానికి చెందిన వారికి కూడా అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

# ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలి.

## –డిఎస్పి కార్యాలయాన్ని తనిఖీ చేసిన.ఎస్పీ గౌస్ ఆలం.

**అదిలాబాద్ అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)** బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదిలాబాద్ డిఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐపిఎస్.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి సాయుధ బలగాలతో కూడిన బృందం గౌరవ వందనాలు అందించి,ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి,పట్టణ సిఐలు సునీల్, కరుణాకర్ పుష్పగుచ్చం అందించి సాదరంగా ఆహ్వానించారు. కార్యాలయ పరిసరాలను చుట్టూ తిరిగి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.పట్టణంలో ఉన్న పోలీస్ పోలీస్ స్టేషన్లో వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదు దారు పిటిషన్ వెంటనే నమోదు చేసి సంబంధిత అధికారులకు అప్పగించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించినప్పుడే ప్రజలలో పోలీసుల పట్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలను పెంచుకోవాలని, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించారని తెలియజేశారు. రాత్రి సమయాలలో అదనంగా గస్తీ నిర్వహిస్తూ ఆర్థిక నేరాలను కట్టడి చేసే విధంగా ప్రణాళికను రూపొందించి అవలంబించాలని సూచించారు.సిబ్బంది ఎల్లవేళలా పోలీస్ స్టేషన్లో అప్రమత్తంగా ఉండి ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు లేకుండా అందుబాటులో ఉండాలన్నారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి ఎటువంటి పెండెన్సీ లేకుండా చూడాలని తెలిపారు.5 ఎస్ విధానాన్ని అమలు చేస్తూ రికార్డుల నిర్వహణను చేపట్టాలని సూచించారు.సిబ్బంది విధులను పర్యవేక్షిస్తూ ఎలాంటి లోపాలను లేకుండా సరిచూడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి,సిఐలు కరుణాకర్, సునీల్,శ్రీనివాస్,నవీన్ డీఎస్పీ కార్యాలయ సిబ్బంది జైపాల్,రవి, కిష్టయ్య,గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో హోమ్ అఫైర్స్ కమిటీ మెంబర్ గా ప్రమాణం స్వీకారం చేసి హోమ్ అఫైర్స్ కమిటీ తొలి మీటింగ్ లో పాల్గొన్న లిలోక్ సభ ప్యానల్ స్పీకర్ మరియు బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ **వార్తా ప్రభ, బాపట్ల**

